

కాపులుప్పాడ వద్ద చెత్త నుంచి విద్యుత్ తయారయ్యే ప్లాంట్‌ను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ. చిత్రంలో ఎమ్మెల్యే గంటా ఉన్నారు

ఎక్సైజ్‌లో కలెక్షన్ కింగ్

బార్‌ల సిండికేట్ నుంచి నెలకు రూ.పది లక్షలు వసూలు

అధికారులు, మీడియాను మేనేజ్ చేయాలని నెపం

సమయపాలన నుంచి బార్‌లకు మినహాయింపు

- లైసెన్స్ ఫీజు సకాలంలో చెల్లించకున్నా సరకు సరఫరా
- ఓ మంత్రికి బంధువునంటూ బెదిరింపులు
- ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకువెళ్లే యోచనలో కొందరు ప్రజాప్రతినిధులు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

జిల్లా ఎక్సైజ్ శాఖలో ఒక అధికారి బార్‌ల నిర్వాహకుల నుంచి ప్రతి నెలా రూ.10 లక్షలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సమయపాలన పాటించడం లేదంటూ...ఈ విషయంలో ఇబ్బందులు తలెత్తకుండా ఎక్సైజ్ శాఖలో కిందిస్థాయి అధికారులతో పాటు మీడియాను మేనేజ్ చేయాల్సి ఉంటుందని సిండికేట్ నుంచి నెలనెలా డబ్బులు తీసుకుంటున్నట్టు తెలిసింది. కొంతమంది వ్యాపారులు మామూళ్లు ఇచ్చేందుకు విముఖత వ్యక్తం చేయడంతోపాటు ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకువెళతామని హెచ్చరించగా, తాను ఒక మంత్రికి సమీప బంధువునని సదరు అధికారి బెదిరించినట్టు సమాచారం. ఈ విషయం కూటమిలోని కొంతమంది ప్రజా ప్రతినిధుల దృష్టికి చేరడంతో ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకువెళ్లేందుకు సిద్ధమవుతున్నట్టు తెలిసింది.

జిల్లాలో 128 బార్ అండ్ రెస్టారెంట్‌లతోపాటు 139 మద్యం దుకాణాలు ఉన్నాయి. వీటన్నింటికీ ఆనందపురంలోని డిపో నుంచి మద్యం సరఫరా అవుతుంది. మద్యం దుకాణాలు ఉదయం 11 నుంచి రాత్రి పది గంటల వరకూ, బార్ అండ్ రెస్టారెంట్‌లు ఉదయం 11 నుంచి రాత్రి 11 గంటల వరకూ విక్రయాలు జరుపుకునేందుకు అనుమతి ఉంటుంది. బార్‌లతో పోల్చితే మద్యం దుకాణాల్లో ధరలు తక్కువగా ఉంటాయి. దీంతో పేద, మధ్య తరగతి వర్గాలకు చెందినవారు దుకాణాల్లోనే మద్యం కొనుగోలు చేస్తారు. ఆ ప్రభావం బార్‌లపై పడుతోంది. ఈ నేపథ్యంలో నిర్వాహకులు సిండికేట్‌గా ఏర్పడి ప్రభుత్వ మద్యం దుకాణాల కారణంగా ఎదురవుతున్న ఇబ్బందిని ఎక్సైజ్ శాఖలోని ఓ అధికారికి వివరించినట్టు తెలిసింది. దీంతో దుకాణాల్లో విక్రయాలను గంట ముందుగా అంటే రాత్రి తొమ్మిది లేదంటే 9.30 గంటలకు నిలిపివేసేలా చూస్తానని అయన హామీ ఇచ్చినట్టు సమాచారం. అంతేకాకుండా బార్లలో గంట లేదా రెండు గంటలు అదనంగా అమ్ముకునేందుకు సహకరించాలని బార్ సిండికేట్ సభ్యులు కోరినట్టు తెలిసింది. అలా చేయాలంటే తమ శాఖలోని అధికారులు, సిబ్బందిని మేనేజ్ చేయాల్సి ఉంటుందని, అలాగే తాము చూసీచూడనట్టు వదిలేసినా మీడియాలో కథనాలు వస్తే ఇబ్బంది పడాల్సి వస్తుంది కాబట్టి ప్రతినెలా డిపార్టుమెంట్‌కు రూ.ఐదు లక్షలు, మీడియాకు రూ.ఐదు లక్షలు ఇవ్వాలని సదరు అధికారి డిమాండ్ చేసి...ఆ మేరకు డబ్బులు వసూలు చేస్తున్నట్టు సమాచారం.

లైసెన్స్ ఫీజు చెల్లించకపోయినా...

దీనికితోడు బార్‌ల నిర్వాహకులు ఏటా ఆగస్టులో లైసెన్స్ ఫీజు చెల్లించాలి. లేదంటే డిపోల నుంచి సరకు సరఫరా చేయరు. కానీ ఎక్సైజ్ శాఖలో ... మిగతా 6వ పేజీలో

నేడు మంత్రి నారా లోకేశ్ రాక

- 30వ తేదీ వరకూ నగరంలోనే యువనేత
- పార్టీ నాయకులు, కేడర్‌తో సమావేశం



విశాఖపట్నం, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి):

రాష్ట్ర మానవ వనరులు, ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్ బుధవారం రాత్రి నగరానికి రానున్నారు. ఆయన గన్నవరం నుంచి రాత్రి 8.45 గంటలకు విమానంలో బయలుదేరి 9.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటారు. విమానాశ్రయం నుంచి సెవెన్‌హిల్స్ ఆస్పత్రి వెనుక ఉన్న తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి చేరుకుని అక్కడే బస చేస్తారు. ఈనెల 29వ తేదీ ఉదయం 9.45 గంటలకు కోర్టు('సాక్షి' పత్రికపై గతంలో దాఖలు చేసిన పరువునష్టం దావా)కు హాజరవుతారు. అక్కడ నుంచి మధ్యాహ్నం పార్టీ కార్యాలయానికి చేరుకుని సాయంత్రం వరకు పార్టీ నాయకులు, కేడర్‌తో భేటీ అవుతారు. సాయంత్రం 6.20 గంటలకు నోవాటెల్ హోటల్‌కు వెళతారు. అక్కడ ఏర్పాటుచేసే డిన్నర్‌లో పాల్గొని రాత్రి 9 గంటలకు తిరిగి పార్టీ కార్యాలయానికి చేరుకుని బస్సులో బస చేస్తారు. ఈనెల 30వ తేదీన మంత్రి కార్యక్రమాలు అధికారికంగా వెల్లడించలేదు.

పార్టీ కార్యాలయం ముస్తాబు

తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మానవవనరుల శాఖా మంత్రి నారా లోకేశ్ నగర పర్యటనకు వస్తుండడంతో జిల్లా పార్టీ కార్యాలయాన్ని ముస్తాబు చేస్తున్నారు. ఆయన రెండు రోజులపాటు పార్టీ కార్యాలయంలో బస చేస్తారు. ఈ నేపథ్యంలో పార్టీ కార్యాలయ ప్రాంగణం, పరిసరాలు శుభ్రం చేశారు. భవనం ముందు, ఎన్టీఆర్ విగ్రహం చుట్టూ రంగులు వేయిస్తున్నారు. కార్యాలయాన్ని సుందరంగా తీర్చిదిద్దాలని రెండు రోజుల క్రితం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, నగర అధ్యక్షుడు గండి బాబ్జీలు నిర్ణయం తీసుకున్నారు. ఆవరణలో టెంట్లు వేయనున్నారు.

ప్రజోపయోగ పనులే చేపట్టండి



వీఎంఆర్‌డీఏ, జీవీఎంసీ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న మంత్రి నారాయణ

- అనవసర వ్యయం వద్దు
- భవన నిర్మాణాలకు, లేఅవుట్లకు అనుమతులు మంజూరులో తాత్సారం చేయొద్దు
- మాస్టర్ ప్లాన్‌పై త్వరలో సమీక్ష
- పీపీపీ విధానంలో వీఎంఆర్‌డీఏ ప్రాజెక్టులు
- జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ సమీక్షలో పురపాలక శాఖా మంత్రి నారాయణ

విశాఖపట్నం, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి):

ఏ పని చేపట్టినా ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలని, అనవసర వ్యయాలు చేయవద్దని జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ అధికారులకు పురపాలక శాఖా మంత్రి పి.నారాయణ సూచించారు. సిరిపురంలోని వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో కమిషనర్లు సంపత్‌కుమార్, విశ్వనాథన్, ఇతర అధికారులతో మంగళవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. భవన నిర్మాణాలకు, లేఅవుట్లకు అనుమతులు ఇవ్వడంలో ... మిగతా 6వ పేజీలో

మంత్రి గరంగరం

- భవన నిర్మాణ అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి పదే పదే షార్ట్ ఫాల్ నోటీసులపై ఆగ్రహం
- ఫిర్యాదీల ఎదుటే అధికారుల నుంచి వివరణ
- ఇకపై రెండో నోటీసు ఇస్తే హెచ్ఓడీకే...

విశాఖపట్నం, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి):

భవన నిర్మాణ అనుమతులకు జీవీఎంసీ అధికారులు పదే పదే షార్ట్ ఫాల్ నోటీసులు ఇస్తున్నారని, అలా ఎందుకు చేస్తున్నారని పురపాలక శాఖా మంత్రి పి. నారాయణ మండిపడ్డారు. వీఎంఆర్‌డీఏలో మంగళవారం నిర్వహించిన సమీక్షలో దీనిపైనే ఆయన రెండు గంటలకుపైగా చర్చించారు. ఎవరైనా దరఖాస్తు చేసుకుంటే అందులో ఏమేమి లేవో క్షుణ్ణంగా పరిశీలించి షార్ట్ ఫాల్ నోటీసు ఇవ్వాలని, ఒకసారి ఇచ్చాక మళ్లీ మళ్లీ అలా నోటీసులు ఇస్తే ... మిగతా 6వ పేజీలో



మాస్టర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ సాధించిన వి.శ్రీరాములును అభినందిస్తున్న విశాఖ క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డీఎస్ వర్మ

101 వయసులో...

- మాస్టర్ అథ్లెటిక్స్ చాంపియన్‌గా నిలిచిన నగరవాసి వి.శ్రీరాములు

విశాఖపట్నం, ఆగస్టు 27:

నూరు వసంతాలు పూర్తిచేసుకున్న నగరానికి చెందిన వల్లభజోస్యుల శ్రీరాములు ఈనెల 13 నుంచి 25వ తేదీ వరకూ స్వీడన్‌లో జరిగిన అంతర్జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో చాంపియన్‌షిప్ సాధించారు. జావెలిన్ త్రో, డిస్కస్ త్రో, షాట్‌పుట్ ఈవెంట్స్‌లో పాల్గొని మూడింటిలోను బంగారు పతకాలు సాధించి ఛాంపియన్‌గా నిలిచారు. స్వీడన్ నుంచి మంగళవారం నగరానికి చేరిన ఆయనకు విశాఖ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు డీఎస్ వర్మ విమానాశ్రయంలో స్వాగతం పలికి అభినందించారు. రాములు గతంలో కూడా అంతర్జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో ఒక బంగారు, రెండు సిల్వర్ పతకాలు సాధించారు.

గుట్టుగా శిశువుల విక్రయాలు

రూ.10 లక్షల వరకూ వసూలు

- సంతానం కోసం ఆస్పత్రుల చుట్టూ తిరిగేవారే టార్గెట్

విశాఖపట్నం, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి):

సంతానం కోసం ఆశగా ఎదురుచూసే దంపతులే లక్ష్యంగా శిశు విక్రయాలను సాగించే ముఠాలు చెలరేగిపోతున్నాయి. జిల్లాలో అనేక ముఠాలు ఈ వ్యాపారం సాగిస్తున్నట్టు సమాచారం. నగరానికే పరిమితం కాకుండా ఇటు శ్రీకాకుళం, అటు కృష్ణా జిల్లా వరకూ తమ కార్యకలాపాలను విస్తరించినట్టు తెలిసింది.

- బిడ్డను ఇస్తామంటూ ఒప్పందం
- ఆ తరువాత ప్రభుత్వ ఆస్పత్రులు, స్కానింగ్ కేంద్రాలకు వచ్చే గర్భిణుల గుర్తింపు
- కుటుంబ, ఆర్థిక పరిస్థితులను తెలుసుకుని డబ్బు ఎర
- ఒక్కొక్కసారి ఆస్పత్రుల నుంచి దొంగిలించి అమ్మకం



శిశువును కొనుగోలు చేయడం దగ్గర నుంచి విక్రయించేంత వరకూ పది నుంచి 15 మంది పనిచేస్తుంటారు. వీరంతా రెండు, మూడు జట్లుగా ఏర్పడి నిర్దేశించిన టార్గెట్‌ను చేరుకునే ప్రయత్నం చేస్తుంటారు. నవజాత శిశువు కోసం వారాలు, నెలలు అన్వేషణ సాగిస్తుంటారు. వీరంతా ఎక్కువగా ప్రైవేటు ఆస్పత్రులు, స్కానింగ్ కేంద్రాల్లో పనిచేసేవారు, వారితో సన్నిహితంగా ఉండేవారేనని అంటున్నారు. నగరంతో పాటు రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో ఈ తరహా వ్యాపారం గుట్టుగా సాగుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో కొందరు ఆర్ఎంపీ, పీఎంపీలు కూడా ఈ వ్యాపారంలో కీలకంగా వ్యవహరిస్తున్నట్టు చెబుతున్నారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్న కుటుంబాలను లక్ష్యంగా చేసుకుంటుంటారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్ఎంపీలు, పీఎంపీలు, పట్టణాల్లో స్కానింగ్ కేంద్రాల వద్ద గుట్టుగా ఈ తరహా ఒప్పందాలను చేసుకుంటున్నట్టు చెబుతున్నారు.

బిడ్డ కావాలంటే...ఆపరేషన్ స్టార్ట్

అత్యంత నమ్మకమైన వారి ద్వారా వచ్చే కేసులను మాత్రమే ఈ తరహా ముఠాలు డీల్ చేస్తుంటాయి. పిల్లల కోసం ఆస్పత్రుల చుట్టూ నెలలు, సంవత్సరాల తరబడి తిరిగే దంపతులను గుర్తిస్తుంటాయి. పిల్లలు పుట్టే అవకాశం లేదని వైద్యులు నిర్ధారించే దంపతులతో టచ్‌లోకి వెళ్లి..ఎలాంటి ఇబ్బందులు లేకుండా నవజాత శిశువును అందిస్తామని చెబు తారు. దానికి వారు అంగీకరిస్తే...వెంటనే వారి ఆపరేషన్ ప్రారంభమవుతుంది. ఇందుకోసం కనీసం రూ.10 లక్షల వరకూ వసూలు చేస్తున్నట్టు భోగట్టా.

ఒప్పందం కుదిరిన వెంటనే ముఠా రంగంలోకి దిగుతుంది. గర్భం దాల్చినవారిని గుర్తించి వారి కుటుంబ, ఆర్థిక ... మిగతా 6వ పేజీలో

ఎసెన్షియాలో రసాయనాల తొలగింపునకు చర్యలు

- అన్ని శాఖల అధికారులతో కమిటీ ఏర్పాటుచేసిన అనకాపల్లి జిల్లా కలెక్టర్
- డెబ్రిస్ తొలగించాకే గోదాములకు తరలింపు
- వారం రోజులు గడువు కోరిన యాజమాన్యం

- 6వ పేజీలో

అనుమతి లేకుండా గ్రీన్ బెల్ట్‌లో ఏర్పాటుచేసిన వైఎస్ విగ్రహం తొలగింపు

- 6వ పేజీలో

అయోమయంలో విద్యార్థుల భవితవ్యం

సీబీఎస్ఈ అంచనా పరీక్షలో 50 శాతం మందికిపైగా ఫెయిల్

- ఆంగ్లంలో 82.29 శాతం, గణితంలో 63.25, సైన్స్‌లో 54.85 శాతం మంది...
- జిల్లాలోని 19 ఉన్నత/రెసిడెన్షియల్ పాఠశాలల్లో మూడేళ్ల కిందట ఎనిమిదో తరగతి నుంచి సీబీఎస్ఈ సిలబస్ బోధన
- ఈ ఏడాది పదో తరగతిలోకి వచ్చిన ఆ విద్యార్థులు
- సన్నాహక పరీక్షలో ఫలితాలు చూసి విద్యా శాఖ అధికారులు, తల్లిదండ్రుల్లో ఆందోళన
- వైసీపీ సర్కారు అనాలోచిత నిర్ణయమే కారణం

విశాఖపట్నం, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలో ఎంపిక చేసిన 19 ఉన్నత/రెసిడెన్సియల్ పాఠశాలల్లో సీబీఎస్ఈ సిలబస్‌లో చదువుతున్న పదో తరగతి విద్యార్థుల భవితవ్యంపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయ వర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. విద్యార్థుల సామర్థ్యం తెలుసుకునేందుకు నిర్వహించిన పరీక్షల్లో 50 శాతానికిపైగా ఫెయిల్ కావడమే అందుకు కారణం. ఆంగ్లంలో 82.29 శాతం మంది, గణితంలో 63.25 శాతం, సైన్స్‌లో 54.85 శాతం, సాంఘిక శాస్త్రంలో 57.45 శాతం మంది తప్పారు. వీరంతా ఈ విద్యా సంవత్సరం సీబీఎస్ఈ బోర్డు నిర్వహించే పరీక్షలు రాయాల్సి ఉంది.



గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తీసుకున్న అనేక విఫల ప్రయోగాలలో సీబీఎస్ఈ సిలబస్ అమలు ఒకటి. దీనిని విద్యావేత్తలు తొలి నుంచి వ్యతిరేకిస్తూనే ఉన్నారు. అయినా పెడిచెవిన పెట్టారు. 2022-23 విద్యా సంవత్సరం నుంచి జిల్లాలో ఎంపిక చేసిన 19 పాఠశాలల్లో ఎనిమిదో తరగతి నుంచి సీబీఎస్ఈ సిలబస్ ప్రారంభించారు. ఆనందపురం, భీమిలి, పద్మనాభం కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు, మారికవలస గిరిజన బాలురు రెసిడెన్సియల్ పాఠశాల, కొమ్మాదిలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, సింహాచలంలో బీసీ సంక్షేమ శాఖ గురుకుల పాఠశాల, మేఘాద్రిపేట, శ్రీకృష్ణాపురం సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల జూనియర్ కళాశాలలు, కణితి, గోపాలపట్నం, అక్కిరెడ్డిపాలెం, నరవ, చిట్టివలస జడ్పీ ఉన్నత పాఠశాలలు, భీమిలిలోని ఏపీ రెసిడెన్సియల్ స్కూలు, మాధవధార, రామ్మూర్తిపంతులుపేట, రైల్వే న్యూకాలనీల్లోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలు, కేడీపీఎం ఉన్నత పాఠశాల, పెందుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో సీబీఎస్ఈ సిలబస్ బోధిస్తున్నారు. అయితే 2022-23లో ఎనిమిదో తరగతి, 2023-24లో తొమ్మిదో తరగతిలో ఆ విద్యార్థులు సీబీఎస్ఈ బోర్డు నిర్వహించే పరీక్షలు కాకుండా ... మిగతా 6వ పేజీలో

అన్న సమారాధన

అక్కయ్యపాలెం, ఆగస్టు 27: కృష్ణాష్టమి సందర్భంగా నందగిరినగర్‌లోని గోకుల కృష్ణ దేవాలయం ఆవరణలో మంగళవారం అన్నసమారాధన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా 43వ వార్డు టీడీపీ అధ్యక్షుడు, విశాఖ అర్బన్ జిల్లా ఉపాధ్యక్షుడు బొడ్డేటి మోహన్ హాజరై ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కన్నయ్య, బసవ జయరాం, శివ, చిన్న అప్పారావు, నందగిరి నగర్ కమిటీ సభ్యులు, చెక్కుడురాయి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

హెచ్‌పీసీఎల్‌లో త్వరలో షట్‌డౌన్ పనులు

మల్కాపురం, ఆగస్టు 27: హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్)లో షట్‌డౌన్ పనులు త్వరలో ప్రారంభంకానున్నాయి. సంస్థలో గల మెరాక్స్, ఎఫ్‌సీసీ-1 యూనిట్‌లను శుద్ధి చేసేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నేపథ్యంలో టెండర్లను ఆహ్వానించారు. మెరాక్స్ యూనిట్ పనులను స్థానిక కాంట్రాక్టర్లకు అప్పగించారు. ఎఫ్‌సీసీ-1 యూనిట్ సివిల్ పనులను రేడియంట్ సంస్థకు అప్పగించగా, మెకానికల్ పనులను మరో కాంట్రాక్టరుకు ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. కాగా, ఇప్పటికే షట్‌డౌన్ పనులు ప్రారంభం కావాల్సి ఉండగా, ఎఫ్‌సీసీ-1 యూనిట్ పనులకు సంబంధించిన మెటీరియల్ రాకపోవడం వల్ల ఆలస్యం చోటు చేసుకున్నట్టు తెలిసింది. అయినప్పటికీ ఆయా సంస్థల్లో పనిచేసేందుకు వర్కర్లను తీసుకునే పనులను సంబంధిత కాంట్రాక్టర్లు మొదలు పెట్టారు. సంస్థలో ఏ యూనిట్‌ను షట్‌డౌన్ చేసినా తప్పని సరిగా మెరాక్స్‌ను కూడా షట్‌డౌన్ చేస్తుంటారు. ఈ యూనిట్ సంస్థలో ఎంతో కీలకమైనది కావడంతో ప్రతిసారి దీనిని షట్‌డౌన్ చేస్తుంటారు. కాగా షట్ డౌన్ పనులు సుమారు 45 రోజుల పాటు కొనసాగుతాయి. సుమారు రూ.పది కోట్ల వ్యయంతో ఈ పనులను చేపడుతున్నారు. కాగా 45 రోజులు పాటు పనిచేసే కార్మికులకు సదరు కాంట్రాక్టర్లు ఈఎస్‌ఐ, పీఎఫ్‌లు చెల్లించరన్న ఆరోపణలు ఉన్నాయి.ఒకవేళ వాటిని చెల్లించినా పూర్తి స్థాయిలో చెల్లించరని తెలిసింది.



భద్రతపై కార్మికుల్లో ఆందోళన

కంపెనీలలో వరుస ప్రమాదాలు జరుగుతున్న నేప థ్యంలో హెచ్‌పీసీఎల్‌లో జరగనున్న షట్‌డౌన్ పనులపై కూడా కార్మికులలో ఆందోళన నెలకొంది. ఈ కంపెనీ ఆయిల్ పరిశ్రమ కావడం వల్ల ఎటు వంటి భద్రత కల్పించి పనులు చేపడతారన్న ప్రశ్నలు తలెత్తు తున్నాయి. సాధారణంగా ఆయిల్ పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల పట్ల యాజమాన్యాలు చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. తలపై హెల్మెట్, కాళ్లకు షూ, బాయిలర్ సూట్, కళ్లజోడు, మాస్క్, చేతికి గ్లౌస్‌లతో పాటు అగ్ని ప్రమాదాల సమయాల్లో వినియోగించేందుకు ఫోమ్ వంటి వాటిని ఏర్పాటు చేయాలని పలువురు కార్మికులు కోరుతున్నారు.

ఎసెన్షియాలో రసాయనాల తొలగింపు

- అన్ని శాఖల అధికారులతో కమిటీ ఏర్పాటుచేసిన కలెక్టర్
- డెబ్రిస్ తొలగించాకే గోదాములకు తరలింపు
- వారం రోజులు గడువు కోరిన యాజమాన్యం

అనకాపల్లి/విశాఖపట్నం, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ఆర్థిక మండలిలో ప్రమాదం జరిగిన ఎసెన్షియా ఫార్మా కంపెనీలో రసాయన నిల్వలు జాగ్రత్తగా తొలగించేందుకు అన్ని శాఖల అధికారులతో కలెక్టర్ కమిటీని ఏర్పాటుచేశారు. పరిశ్రమలు, అగ్నిమాపక, ఆర్ అండ్ బి, డ్రగ్ కంట్రోలర్, ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్, బాయిలర్ శాఖల అధికారులతో కలెక్టర్ విజయ కృష్ణన్ మంగళవారం చర్చించారు. ఎసెన్షియా కాంపౌండ్‌లో పది రియాక్టర్లు ఉన్నాయని, వాటిలో ప్రాసెస్ జరుగుతుండగా ప్రమాదం జరిగిందని, వెంటనే వాటిని ఆపేశారని, ఆయా రియాక్టర్లలో రసాయన నిల్వలు ఉండిపోయాయని, జాగ్రత్తగా తరలించాలని సూచించారు. ఈ క్రమంలో ఎవరికీ ఎటువంటి నష్టం జరగకుండా చూడాలన్నారు. బల్క్ డ్రగ్స్, ఇంటర్మీడియట్ మందుల తయారీకి అవసరమైన రసాయన ముడి పదార్థాలు, సాల్వెంట్లు, పౌడర్లను కంపెనీ యాజమాన్యం భారీగా నిల్వ చేసిందని, వాటిని కూడా సంస్థ గోదాములకు సురక్షితంగా తీసుకువెళ్లాలని కలెక్టర్ ఆదేశించారు. దీని కోసం అన్ని శాఖలు ప్రామాణిక ఆపరేటింగ్ విధానం (స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్-ఎస్‌ఓపీ) అనుసరించాలని సూచించారు. ఎవరెవరు ఏమి చేస్తారో క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. ఈ పనులన్నీ చేపట్టాలంటే ముందుగా అక్కడ డెబ్రిస్ తొలగించాలని, మంటలు ఆర్పడానికి వెదజల్లిన నీరు నిల్వ ఉండిపోయిందని, కొన్ని క్యాబిన్లలో రసాయన పొగలు వ్యాపించాయని వాటిని బయటకు పంపడానికి అద్దాలను పగలగొట్టారని అవన్నీ అలాగే ఉన్నాయని, రసాయన పొగకు ఆ ప్రాంతమంతా జిడ్డుగా మారిందని, అవన్నీ క్లియర్ చేస్తే తాము పనులు ప్రారంభిస్తామని అధికారులు వివరించారు. ప్రమాద తీవ్రతకు కంపెనీలో లిఫ్ట్ పాడైపోయిందని, ఇప్పుడు భారీగా ఉన్న నిల్వలు తరలించాలంటే...హైడ్రాలిక్ లిఫ్టులు అవసరమని, అదేవిధంగా నిపుణులు, అనుభవజ్ఞులైన సిబ్బంది అవసరమని అధికారులు చెప్పారు. వీటన్నింటినీ సమకూర్చుకోవడానికి, తరలింపునకు వీలుగా గ్రౌండ్ క్లియర్ చేయడానికి వారం రోజులు సమయం కావాలని యాజమాన్య ప్రతినిధులు కోరారు. వీలైనంత త్వరగా ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్ వారికి సూచించారు.

ఏమేమి ఉన్నాయంటే...

- మొదటి అంతస్థులో సాల్వెంట్ పంపింగ్ చేసిన రియాక్టర్ సామర్థ్యం వేయి లీటర్లు కాగా అందులో ఎంటీబీఈ 700 లీటర్లు ఉందని గుర్తించారు. కింద గ్రౌండ్ ఫ్లోర్‌లోని ట్యాంకర్ సామర్థ్యం పది వేల లీటర్లు కాగా అందులో ఏమున్నా ప్రమాదం లేదని తేల్చారు.
- ప్రమాదానికి కొద్ది సమయం ముందు ఉత్పత్తికి అవసరమైన ముడి పదార్థాలు అన్నింటిని అక్కడకు చేర్చారు. వాటికి ఎటువంటి నష్టం కలగలేదు. వాటిని కూడా తరలించాలని నిర్ణయించారు.
- ప్రమాదం జరిగిన ప్రాంతానికి సమీపంలోనే ముడి పదార్థాల స్టోరేజీ ఏరియా ఉంది. ఆర్డర్‌పై తయారు చేసిన ఇంటర్మీడియట్ మందులన్నీ అక్కడ ఉన్నాయి. వాటిని కూడా గోదాముకు తరలించనున్నారు.
- సుమారు 60 బ్యాచ్‌ల మందుల తయారీకి అవసరమైన ముడి పదార్థాలు, 25 లీటర్ల సామర్థ్యం కలిగిన డ్రమ్ములతో నిల్వ చేశారు. వాటిని కూడా తరలింపు జాబితాలో చేర్చారు.

పీపీఈ కిట్లతో పనులు

ప్రమాదం జరిగిన ప్రాంతం నుంచి రసాయనాలు తొలగించడం రిస్క్‌తో కూడుకున్న వ్యవహారం కాబట్టి, దానివల్ల మరో ప్రమాదం జరగకుండా ముందుగానే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఆ పనుల్లో పాల్గొనే వారందరికీ పర్సనల్ ప్రొటెక్టివ్ ఎక్విప్‌మెంట్ ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. అవసరమైతే ఈ పనులకు నిపుణులను అవుట్ సోర్సింగ్ చేసుకోవాలని సూచించారు.

2 నుంచి బీజేపీ సభ్యత్వ నమోదు



సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరీ, విష్ణుకుమార్‌రాజు

సీతమ్మధార, ఆగస్టు 27: బీజేపీ బలోపేతానికి సెప్టెంబరు 2వ తేది నుంచి చేపట్టనున్న బీజేపీ సదస్యత అభియాన్ (సభ్యత్వ నమోదు)ను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి సూచించారు. ఆమె అధ్యక్షతన విజయవాడలో మంగళవారం ఈమేరకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖ నార్త్ ఎమ్మెల్యే, బీజేపీ ఫ్లోర్ లీడర్, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ, సెప్టెంబరు 2వ తేదీ సాయంత్రం ఢిల్లీలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సభ్యత్వం నమోదు చేసుకుని ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. దేశ వ్యాప్తంగా పార్టీ బలోపేతానికి చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రులు భూపతిరాజు శ్రీనివాస్‌వర్మ, వర్మ, రాష్ట్ర మంత్రి వై.సత్యకుమార్, ఎంపీలు, ఎమ్మెల్యేలతోపాటు ఆ పార్టీ జాతీయ సహ సంఘటన మంత్రి శివప్రకాశ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు బోధనేతర పనులు వద్దు: యూటీఎఫ్

అక్కయ్యపాలెం, ఆగస్టు 27: ఉపాధ్యాయులకు బోధనేతర పనులనుంచి పూర్తిస్థాయిలో మినహాయించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు, టీఆర్ అంబేద్కర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా ఉప విద్యాశాఖాధికారిని కె.సువర్ణను చినగదిలిలోని విద్యాశాఖ కార్యాలయంలో మంగళవారం కలిసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ పలు పోరాటాలు చేసిన ఫలితంగా ప్రస్తుత ప్రభుత్వం మరుగుదొడ్లకు ఫొటోలు తీసే బాధ్యత నుంచి ఉపాధ్యాయులను తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. కానీ, ఈ ఫొటోలు స్కూల్ మేనేజ్‌మెంట్ చైర్మన్ (ఎస్ఎంసీ) వెల్ఫేర్ అసిస్టెంట్లతో తీయించాలని సూచించదన్నారు. అలాగే, ప్రతి రోజూ సాయంత్రం పది అంశాలతో కూడిన గూగుల్ ఫామ్ పూర్తి చేసి ప్రధానోపాధ్యాయులు అప్‌లోడ్ చేయాలని పేర్కొన్నట్టు తెలిపారు. ఎస్ఎంసీ సభ్యులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు మరుగుదొడ్ల ఫొటోలు తీయకుంటే ప్రధానోపాధ్యాయులు దానికి బాధ్యత వహించాలని జీవోలో పేర్కొనడం తగదన్నారు. మరుగుదొడ్ల ఫొటోలు తీసే బాధ్యతలను తొలగించారని భావిస్తున్న తరుణంలో మరింత భారాన్ని పెంచేలా ఉత్తర్వులివ్వడంపై వారు ఖండించారు. వినతి పత్రం సమర్పించిన వారిలో యూటీఎఫ్ కోశాధికారి కె. రాంబాబు, కార్యదర్శులు ఉప్పాడడ రాము, రియాజ్ అహ్మద్, పెందుర్తి మండల అధ్యక్షులు అప్పలరాము తదితరులు ఉన్నారు.



వినతి పత్రం అందిస్తున్న యూటీఎఫ్ నాయకులు

బైరవకోన వద్ద భక్తులకు వసతులు కల్పించాలి: కలెక్టర్

మహారాణిపేట, ఆగస్టు 27: సింహాచలం సమీపంలోని బైరవకోన వద్ద భక్తులకు కనీస వసతులు కల్పనతోపాటు, వారికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. మంగళవారం సింహాచలం ఈవో శ్రీనివాసమూర్తి ఇతర అధికారులు కలెక్టర్‌ను కలిసి బైరవకోన స్థితిగతులను వివరించారు. అమావాస్య రోజు భక్తుల రద్దీ ఇతర అంశాలను తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ భక్తులకు కల్పించాల్సిన పలు వసతులపై సూచనందించారు. తాగునీరు, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు గస్తీ ఏర్పాటు చేయాలన్నారు.

జిల్లా ఉపాధి కార్యాలయంలో 30న జాబ్‌మేళా

కంచరపాలెం, ఆగస్టు 27 : కంచరపాలెంలోని జిల్లా ఉపాధికార్యాలయంలో ఈనెల 30వ తేదీ శుక్రవారం జాబ్‌మేళాను నిర్వహించనున్నట్టు జిల్లా ఉపాధికల్పనాధికారి సీహెచ్.సుబ్బిరెడ్డి పేర్కొన్నారు. ఈ మేళాలో అమెజాన్, సినర్జీస్ క్యాస్టింగ్, వరుణ్‌మోటార్స్, రిలయన్ నిప్పాస్ లైఫ్ ఇన్సూరెన్స్, మెడ్‌ప్లస్ ఫార్మా తదితర ఎనిమిది ప్రముఖ కంపెనీలు పాల్గొననున్నాయి. పది, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, డిప్లొమా, ఫార్మసీ కోర్సులు పూర్తిచేసిన నిరుద్యోగులు మేళాలో పాల్గొనవచ్చును. అభ్యర్థులు ముందుగా తమ వివరాలను నేషనల్ కెరియర్ సర్వీస్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్లు చేసుకోవాల్సి ఉంటుంది. ఆసక్తి గల వారు 30న అన్నీ ధ్రువపత్రాలతో కార్యాలయంలో జరగనున్న ఇంటర్వ్యూలకు ఉదయం 9గంటలకు హాజరు కావాలని సుబ్బిరెడ్డి సూచించారు.

నాగేశ్వరరావుకు అభినందన

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఆగస్టు 27: ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో స్థానం పొందిన నగరానికి చెందిన చెల్లుబోయిన నాగేశ్వరరావును మిజోరం గవర్నర్ కంభంపాటి హరిబాబు మంగళవారం తన నివాసంలో అభినందించారు. జిల్లా మలేరియా కార్యాలయంలో నాగేశ్వరరావు ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తూ క్రీడలపై ఆసక్తితో గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో ప్రతిభ గల వర్ధమాన ఔత్సాహికులను గుర్తించి ప్రోత్సహిస్తున్నారు. ఈ సేవల నేపథ్యంలో ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో చోటు దక్కడంపై ఆయనను ప్రత్యేకంగా అభినందించారు.



నాగేశ్వరరావును అభినందిస్తున్న మిజోరం గవర్నర్ హరిబాబు

ఎక్సైజ్‌లో కలెక్షన్ కింగ్

... 5వ పేజీ తరువాయి

చక్రం తిప్పుతున్న ఈ అధికారికి అస్మదీయులైన బార్‌ల నిర్వాహకులు లైసెన్స్ ఫీజు కొన్నినెలలు ఆలస్యంగా చెల్లించినా వారికి సరకు సరఫరా చేసేస్తున్నారని కొంతమంది బార్‌ల నిర్వాహకులు ఆరోపిస్తున్నారు. బీచ్‌రోడ్డులోని ఓ బార్ నిర్వాహకుడు గత ఏడాది ఆగస్టులో లైసెన్స్ ఫీజు చెల్లించకుండా ఆరు నెలల తర్వాత ఈ ఏడాది ఫిబ్రవరిలో రూ.75 లక్షలు చెల్లించారు. కానీ ఆ బార్‌కు మద్యం సరఫరా ఆగలేదు. సదరు అధికారి తీరుపై కొంతమంది బార్‌ల నిర్వాహకులు ధైర్యంగా నిలదీయడంతోపాటు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ దశలో తాను ఓ మంత్రికి బంధువునని, తనను ఎవరూ ఏమీ చేయలేరని, పైగా కొత్త ఇబ్బందులు ఎదురవుతాయని బెదిరిస్తుండడంతో వారంతా మిన్నకుండిపోతున్నట్టు ఎక్సైజ్ శాఖ సిబ్బందే చెబుతున్నారు. ఈ నేపథ్యంలో సదరు అధికారి తీరు కొంతమంది కూటమి ప్రజాప్రతినిధుల దృష్టికి చేరడంతో వారు ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకువెళ్లే యోచనలో ఉన్నట్టు తెలిసింది.

కనకమహాలక్ష్మికి అష్టదళపద్మారాధన

జగదాంబ కూడలి, ఆగస్టు 28: కనకమహాలక్ష్మికి అష్టదళపద్మారాధన సేవలను మంగళవారం నిర్వహించారు. 108 స్వర్ణపుష్పాలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. ఈపూజల్లో ఉభయదాతలు, ఆలయ అధికారులతోపాటు భక్తులు పాల్గొన్నారు. శ్రావణమాసోత్సవాల్లో భాంగా అమ్మవారిని శ్రావణలక్ష్మి కొలుస్తూ కుంకుమపూజలను జరిపారు,

ప్రజోపయోగ పనులే చేపట్టండి

... 5వ పేజీ తరువాయి

తాత్సారం చేయడం తగదని, ఈ విషయంలో ఫిర్యాదులు రాకూడదని హెచ్చరించారు. ప్రతి పనికీ నిర్దేశిత సమయం ఉందని, ఆ గడువులోగా పూర్తిచేయాలన్నారు. ప్రజల్ని పదేపదే కార్యాలయాలకు వచ్చేలా చేయడం తగదన్నారు. జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ ఆస్తుల పరిరక్షణ, రహదారుల విస్తరణ, ఆక్రమణలు, పార్కింగ్ సమస్యలు, అనధికార నిర్మాణాలు, లేఅవుట్లు, హాకర్ జోన్లు, వెండింగ్ జోన్లపై చర్చించారు. పీపీపీ విధానంలో ఎవరు ఏయే పనులు చేపట్టారో అడిగి తెలుసుకున్నారు. ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టు, ఫ్లైఓవర్లు, బస్సు షెల్టర్లు, ఫ్యూయల్ స్టేషన్లు, ల్యాండ్ మానిటైజేషన్, ముడసర్లోవలో ఎమ్యూజ్‌మెంట్ పార్కు, నీటి సరఫరా ఆటోమేషన్ పనులు, స్టేడియాలు, స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లు, ఎలక్ట్రిక్ వాహనాల చార్జింగ్ స్టేషన్ల గురించి జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ వివరించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ రహదారులపై సెంటర్ మీడియన్‌లో ఉన్న ప్రకటనల బోర్డులు తొలగించాలని ఆదేశించారు. జోన్ల పరిధిలో భవన నిర్మాణాలకు అనుమతులు ఎందుకు ఆలస్యం అవుతున్నాయని ప్రశ్నించారు. త్వరలో ఈ అంశాలన్నింటిపైనా వీడియో కాన్ఫరెన్స్ పెట్టి వివరంగా చర్చిస్తానన్నారు.

చెరువుల మధ్య నుంచి రహదారులా!?

వీఎంఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్‌ను వైసీపీ నాయకులు వారికి నచ్చినట్టుగా మార్చుకున్నారని అనేక ఫిర్యాదులు ఉన్నాయని, చెరువుల మధ్య నుంచి మాస్టర్ ప్లాన్ రహదారులు వేశారని తన దృష్టికి వచ్చిందని, వాటన్నింటిపై త్వరలో ప్రత్యేక సమీక్ష నిర్వహిస్తామని మంత్రి నారాయణ తెలిపారు. అలాగే వీఎంఆర్‌డీఏ ఆర్థిక పరిస్థితి అంత బాగా లేనందున ప్రాజెక్టులను పీపీపీ విధానంలో చేపట్టాలని సూచించామన్నారు.

ప్రజా ప్రతినిధులతో భేటీ

అధికారులతో సమీక్ష ముగిసిన తరువాత జిల్లాలోని ప్రజా ప్రతినిధులు ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, గణబాబు, వంశీకృష్ణ, పంచకర్ల రమేశ్‌బాబు, బండారు సత్యనారాయణమూర్తి, ఎమ్మెల్సీలు దువ్వారపు రామారావు, వేపాడ చిరంజీవిరావు, జీవీఎంసీలో పార్టీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావులతో సమావేశం నిర్వహించారు. వీఎంఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్, ఫ్లైఓవర్ వంతెనలు, ఓపెన్ కాలువలు, సివరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంటు, అండర్ గ్రౌండ్ కాలువలు, 24/7 నీటి సరఫరా, స్మార్ట్ సిటీ అభివృద్ధి పనులపై చర్చించారు. గత ప్రభుత్వం స్వచ్ఛ భారత్ నిధుల వినియోగంలో విఫలమైందని, కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.2,790 కోట్లు రాష్ట్రానికి విడుదల కాలేదని మంత్రి చెప్పారు. దాంతో పురపాలక సంఘాల్లో అభివృద్ధి పనులు పూర్తిగా కుంటుపడ్డాయన్నారు. వచ్చే నాలుగు నెలల్లో ఆర్థిక స్థితిని పూర్తిగా మెరుగుపరుస్తామన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్లు రవీంద్ర, వర్మ, రమణమూర్తి, వినయకుమార్, సురేశ్, శ్రీనివాసరావు, ఫణిరామ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సంఘ నేతలకు నివాళి



నేతల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

అక్కయ్యపాలెం, ఆగస్టు 27 : సీనియర్ రాష్ట్ర ఉపాధ్యాయ నేత సింగరాజు రామకృష్ణయ్య, ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యాయ నేత గులిపల్లి సింహాద్రప్పుడు వర్ధంతి కార్యక్రమాన్ని 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ నాయకులు వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరావు, పీఈ టీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎ.సునంద్, సీతమ్మధార మండల అధ్యక్ష, కార్యదర్శులు దేముడు బాబు, పీఎస్ రెడ్డి, రాజు, కేఎన్‌వీ రమణ, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ డిస్పెన్సరీ వితరణ

అక్కయ్యపాలెం, ఆగస్టు 27: గ్రేటర్ 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని భవిత కేంద్రానికి లయన్స్ క్లబ్ సభ్యులు రూ.12వేల విలువ గల చల్లని, వేడి నీరు, నార్మల్ నీరువచ్చే వాటర్ డిస్పెన్సరీ పరికరాన్ని మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు రామారావు, బాలామణి, లయన్స్ క్లబ్ గవర్నర్, భవిత కేంద్రం ఉపాధ్యాయులు శారద, జగదాంబ పాల్గొన్నారు.

గ్రీన్‌బెల్ట్‌లో వైఎస్ విగ్రహం తొలగింపు

టీడీపీ నేతల ఫిర్యాదుతో జీవీఎంసీ చర్యలు

విశాఖపట్నం, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): అక్కయ్యపాలెం జంక్షన్‌లో జాతీయ రహదారికి(గ్రీన్‌బెల్ట్) ఆనుకుని అనుమతిలేకుండాఏర్పాటుచేసిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్. రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని జీవీఎంసీ అధికారులు సోమవారం అర్ధరాత్రి తరువాత తొలగించారు. ఆదివారం రాత్రి స్థానిక కార్పొరేటరు బానాల శ్రీనివాసరావు మరికొందరు వైసీపీ నేతలు హడావిడిగా రాజశేఖరరెడ్డి విగ్రహంపెట్టారు. సోమవారం ఉదయం టీడీపీ నాయకులు గుర్తించి, జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన ఫిర్యాదు మేరకు జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ ఆదేశాలతో టౌన్‌ప్లానింగ్ అధికారులు రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని తొలగించారు. పబ్లిక్ రోడ్లు, పేవ్‌మెంట్లు పక్కన, ఇతర ప్రజా ప్రయోజనాలున్న ప్రాంతాల్లో విగ్రహాలు ఏర్పాటు చేయరాదని జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ సురేష్‌కుమార్ ఈ సందర్భంగా తెలిపారు.



అక్కయ్యపాలెం జంక్షన్‌లో తొలగించిన విగ్రహం

100 అడుగుల పోల్ ఏమైంది?

విగ్రహం ఏర్పాటుచేసిన చోటే గత ఏడాది జీవీఓంపీ నిధులతో 100 అడుగుల పొడవైన వైసీపీ జెండాను ఆవిష్కరించారు. ప్రభుత్వం మారిన తరువాత జెండాను తొలగించారు. అయితే, ఆదివారం వరకు పోల్ ఉండేది. అదేరోజురాత్రి వైఎస్ విగ్రహం ఏర్పాటుచేసే సమయంలో అక్కడున్న పోల్‌ను తొలగించారు. దీనిపై చర్చ సాగుతుంది. వైసీపీ నేతలు పోల్‌ను తీసుకెళ్లారని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు.

వైసీపీ నేతల నిరసన

వైస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని కక్షపూరితంగా కూలగొట్టిన కూటమి నాయకులను అరెస్ట్ చేయాలని జీవీఎంసీ ఫ్లోర్‌లీడర్, 44వ వార్డు కార్పొరేటర్ బానాల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మంగళవారం వైసీపీనాయకులతో కలిసి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలగొట్టిన వైఎస్సార్ విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కటుమూరి సతీష్, కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్‌రాజు, బర్కత్ ఆలీ, బొడ్డేటి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి గరంగరం

... 5వ పేజీ తరువాయి

దాని పరమార్థం ఏమిటని ప్రశ్నించారు. దీనిని ప్రజలు వేధింపుగా భావిస్తున్నారన్నారు. తన దృష్టికి వచ్చిన పలు ఫిర్యాదులను ఆయన సమీక్షలోనే ప్రశ్నించారు. ఆరు నెలల నుంచి అనుమతి ఇవ్వకుండా తిప్పుతున్నారని ఐదుగురు వ్యక్తులు వేర్వేరుగా ఫిర్యాదు చేయగా వారిని సమావేశానికి పిలిచి, దానికి కారణం ఏమిటో సంబంధిత అధికారితో చెప్పించారు. వాటికి రెండు మూడు రోజుల్లోనే క్లియరెన్స్ ఇవ్వాలని ఆదేశించారు. అలాగే వీఎంఆర్‌డీఏలో కూడా లేఅవుట్ల అనుమతులు ఇవ్వడం లేదని కొందరు చేసిన ఫిర్యాదులపై విచారణ చేశారు. ఇకపై ఏ అధికారి అయినా దరఖాస్తుదారుకు రెండో షార్ట్ ఫాల్ ఇచ్చినట్టయితే అది నేరుగా సంబంధిత శాఖ హెచ్‌ఓడీకి వెళ్లేలా సాఫ్ట్‌వేర్ మారుస్తామని, ఆపై ఆటలు సాగవని స్పష్టంచేశారు. అవసరమైతే దీనిపై టాస్క్ ఫోర్స్ పెడతామని, నిబంధనల ప్రకారం పని జరిగిపోవాలన్నారు. జీవీఎంసీలో భూగర్భ డ్రైనేజీ కనెక్షన్లను ప్రజలు ఎందుకు తీసుకోవడం లేదని మంత్రి ప్రశ్నించారు. ఫీజులు ఎంత వసూలు చేస్తున్నారంటూ వివరాలు అడిగారు.

గుట్టుగా శిశువుల విక్రయాలు

... 5వ పేజీ తరువాయి

పరిస్థితులను గమనిస్తారు. వారికి డబ్బు ఆశ చూపిస్తారు. బిడ్డ పుట్టేంత వరకు వారి బాగోగులు చూసుకుంటారు. అందుకు అవసరమైన ఖర్చులు సమకూరుస్తారు. బిడ్డ పుట్టిన తరువాత మిగిలిన మొత్తాన్ని చెల్లించి తీసుకువెళుతుంటారు. ముఖ్యంగా ఇతరులతో సంబంధం లేని వారిని మాత్రమే ఇలాంటి వాటికి ఎంపిక చేసుకుంటారు. అదేవిధంగా రక రకాల కారణాలతో బిడ్డను వద్దనుకునే వారిని కూడా ట్రాప్ చేస్తారు. ఇదంతా ప్రణాళిక ప్రకారం సాగించే వ్యవహారం. ఇలాకాకుండా కొన్నిచోట్ల చిన్నారులను ఆస్పత్రులు, లేబర్ రూముల నుంచి దొంగతనం చేసి విక్రయించేవారున్నారు.

అధికారికంగా దత్తత

పిల్లలు లేని దంపతులు అనధికారికంగా ఇలా చిన్నారులను కొనుగోలు చేయడం నేరమని బాలల సంక్షేమ శాఖ అధికారులు చెబుతున్నారు. ఎవరైనా పిల్లలు కావాలనుకుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా దత్తత ఇస్తున్నాయని, ఇందుకోసం కారా పేరుతో వెబ్‌సైట్ ఉందని చెబుతున్నారు. ఇందులో రిజిస్ట్రేషన్ చేసుకోవడం ద్వారా తమకు కావాలనుకునే బాలిక/బాలుడిని దత్తత తీసుకోవచ్చునంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా చిన్నారులను కొనుగోలు చేస్తే చట్టపరంగా ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు.

అయోమయంలో విద్యార్థుల భవితవ్యం

... 5వ పేజీ తరువాయి

పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే పరీక్షలకు హాజరయ్యారు. ప్రస్తుతం 10వ తరగతిలోకి రావడంతో తప్పనిసరిగా సీబీఎస్ఈ బోర్డు పరిధిలో వచ్చే ఏడాది జరగనున్న పబ్లిక్ పరీక్షలు రాయాల్సి ఉంది. దీంతో విద్యార్థులు ఎంతవరకు సీబీఎస్ఈ సిలబస్ ఆకళింపు చేసుకుంటున్నారు?...అనే విషయం తెలుసుకునేందుకు ఈనెల 21వ నుంచి 24వ తేదీ వరకు ఇంగ్లీష్, గణితం, సైన్స్, సోషల్ స్టడీస్‌లలో పరీక్షలు ఆన్‌లైన్‌లో నిర్వహించారు. ప్రతి సబ్జెక్టులో 50 మార్కులకు 50 ప్రశ్నలతో ప్రశ్నపత్రం రూపొందించారు. పరీక్ష రాయడానికి ట్యాబ్‌లు ఇచ్చారు. తరువాత ప్రశ్నపత్రాలను మదింపుచేసిన పాఠశాల విద్యాశాఖ ఫలితాలు చూసి షాక్ తిన్నది. సీబీఎస్ఈలో 33 శాతం మార్కులు వస్తేనే ఉత్తీర్ణత సాధించినట్టు. అయితే 80 మార్కులు థియరీ, 20 మార్కుల ప్రాక్టికల్స్ ఉంటాయి. రెండింటిలో 33 శాతం సాధించాలి. దీంతో తాజా పరీక్షలలో కనీసం 40 మార్కులను పాస్ మార్కులుగా నిర్ణయించారు. అంటే 40 శాతం కంటే తక్కువ వస్తే పరీక్ష తప్పినట్టే. జిల్లాలో 2,203 మందికి పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లుచేయగా ఇంగ్లీష్‌కు 1,977 మంది హాజరయ్యారు. వారిలో 1,627 మందికి 40 శాతం కంటే తక్కువ మార్కులు వచ్చాయి. మరో 295 మంది 41 నుంచి 60 శాతం, 51 మంది 61 నుంచి 80 శాతం, ముగ్గురు మాత్రమే 81 శాతం మార్కులు తెచ్చుకున్నారు. గణితం పరీక్షకు 2,173 మంది హాజరుకాగా 1,374 మందికి 40 శాతం కంటే తక్కువ మార్కులు వచ్చాయి. 505 మంది 41 నుంచి 60 శాతం, 288 మంది 61 నుంచి 80 శాతం, ఆరుగురు 81 శాతం మార్కులు తెచ్చుకున్నారు. సైన్స్ పరీక్ష 2,175 మంది రాయగా 1,193 మందికి 40 శాతం కంటే తక్కువ మార్కులు వచ్చాయి. 677 మంది 41 నుంచి 60 శాతం, 286 మంది 61 నుంచి 80 శాతం, 19 మంది 81 శాతం కంటే ఎక్కువ మార్కులు తెచ్చుకున్నారు. సాంఘిక శాస్త్రం పరీక్షకు 2167 మంది హాజరుకాగా 1,245 మందికి 40 శాతం కంటే తక్కువ మార్కులు వచ్చాయి. మరో 627 మంది 41 నుంచి 60 శాతం, 201 మంది 61 నుంచి 80 శాతం, 94 మంది 81 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించారు. తాజా ఫలితాల నేపథ్యంలో సీబీఎస్ఈ బోర్డు నిర్వహించే పరీక్షలకు విద్యార్థులను ఏ విధంగా సన్నద్ధం చేయాలో అర్థంకావడం లేదని విద్యా శాఖ అధికారులు అంటున్నారు.



గాజువాకలో వినాయక విగ్రహాల తయారీలో నిమగ్నమైన కోల్‌కతాకు చెందిన కళాకారులు

వివిధ ఆకృతులు, సైజుల్లో తయారు చేస్తున్న కళాకారులు

ఆర్డర్లు ఆశాజనకంగా ఉన్నాయంటున్న ప్రతిమల తయారీదారులు

చవితి ఉత్సవాలకు ముస్తాబవుతున్న గణనాథులు

గాజువాక, ఆగస్టు 27: వినాయక చవితి ఉత్సవాలకు గణనాథులు ముస్తాబు అవుతున్నారు. గాజువాక కేంద్రంగా ఇరవైకి పైగా ప్రాంతాల్లో గత నెల రోజులుగా విఘ్నేశ్వరుని విగ్రహాలు తయారవుతున్నాయి. ఈ ఏడాది ఒక్కో కేంద్రానికి ఇప్పటికే 50 నుంచి 80 వరకు ఆర్డర్లు వచ్చినట్టు విగ్రహాల తయారీదారులు చెబుతున్నారు. వినాయక చవితికి నెల రోజుల ముందే ఇతర రాష్ట్రాలకు చెందిన విగ్రహాల తయారీదారులు కుటుంబాలతో సహా గాజువాక పరిసర ప్రాంతాలకు వచ్చి ప్రతిమల రూపకల్పనలో నిమగ్నమయ్యారు. జూలై నెలలోనే వచ్చిన కోల్‌కతాతో పాటు పలు రాష్ట్రాలకు చెందిన విగ్రహాల తయారీదారులు విజయదశమి (దుర్గాపూజ) వరకు ఇక్కడే ఉంటారు. ప్రధానంగా లంకెలపాలెం నుంచి సింధియా ప్రాంతీయులతో పాటు నగరంలోని పలు ప్రాంతాలకు చెందిన వినాయక చవితి ఉత్సవాల నిర్వాహకులు ఇక్కడి ప్రతిమల తయారీదారులకు ఆర్డర్లు ఇస్తున్నారు. ఉత్సవాల నిర్వాహకులు కోరుకున్న ఆకారాలు, ఎత్తులతో గణేశుని విగ్రహాలకు ఆర్డర్లు ఇవ్వడంతో వాటి రూపకల్పనలో తయారీదారులు బిజీగా ఉన్నారు. విగ్రహాల సైజు, ఎత్తును బట్టి ఒక్కో ప్రతిమకు రూ.పది వేల నుంచి రూ.50 వేల వరకు వసూలు చేస్తున్నారు. కాగా కాలుష్య రహిత విగ్రహాలనే ఎక్కువగా తయారు చేస్తున్నారు. గణేశులు, కనకదుర్గమ్మ విగ్రహాల తయారీ కోసం వివిధ ప్రాంతాల నుంచి ప్రత్యేకమైన మట్టిని తీసుకువస్తున్నారు. అదేవిధంగా పలు రకాల రంగులను కోల్‌కతా నుంచి తెప్పించారు. ఇక్కడి హౌసింగ్ బోర్డు కాలనీ, డెయిరీ కాలనీ, వినాయక నగర్, హైస్కూల్ రోడ్డు, తదితర ప్రాంతాల్లో విఘ్నేశ్వరుల విగ్రహాలను తయారు చేస్తున్నారు. కాగా ఈ ఏడాది కాస్త భారీ విగ్రహాలను కూడా తీర్చిదిద్దుతున్నట్టు ఆయా తయారీ కేంద్రాల నిర్వాహకులు పేర్కొంటున్నారు.

ఆశాజనకంగా ఆర్డర్లు

-శ్యామల్‌పాల్, విగ్రహాల తయారీదారుడు



గాజువాక ప్రాంతంలో గత కొన్నేళ్లగా విగ్రహాలు తయారు చేస్తున్నాం. కోల్‌కతాలో విగ్రహ తయారీదారుల్లో ఓ ప్రత్యేకత ఉంటుంది. అందుకే ఇక్కడకు వచ్చి గణనాథులు, దుర్గాదేవి ప్రతిమలను తయారు చేస్తున్నాం. అన్నీ కాలుష్య రహిత విగ్రహాలనే రూపొందిస్తున్నాం. ఈ ఏడాది ఆర్డర్లు కూడా ఆశాజనకంగానే వచ్చాయి. వివిధ ఆకృతులు, సైజుల్లో విగ్రహాలను తయారు చేస్తున్నాం.

గోపాలపట్నంలో..

గోపాలపట్నం: గణేశుని ఉత్సవాలు సమీపిస్తున్న నేపథ్యంలో వినాయక ప్రతిమల తయారీ జోరందుకుంది. విగ్రహాల తయారీలో సిద్ధహస్తులైన కోల్‌కతాకు చెందిన కళాకారులు పలు ప్రాంతాల్లో వీటిని అధిక సంఖ్యలో రూపొందిస్తున్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసే వినాయక విగ్రహాలను పూజలకు వినియోగించడం వల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుంది కాబట్టి వాటిని తయారు చేయడాన్ని పూర్తిగా విరమించుకున్నట్టు విగ్రహాలను తీర్చిదిద్దే కార్మికులు చెబుతున్నారు. ఇప్పటికే వివిధ ఆకారాలు, సైజులకు సంబంధించి ఆర్డర్లు రావడంతో గణేశుని ప్రతిమల తయారీలో వారంతా బిజీగా ఉన్నారు.



చవితి ఉత్సవాలకు సిద్ధమవుతున్న గణేశులు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న పంచకర్ల రమేశ్‌బాబు, తదితరులు

వైద్య, రక్తదాన శిబిరాల పోస్టర్లు ఆవిష్కరణ

పెందుర్తి, ఆగస్టు 27: ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జన్మనాన్ని పురస్కరించుకుని సెప్టెంబరు రెండున జనసేన పార్టీ 88వ వార్డు అధ్యక్షుడు వబ్బిన శ్రీకాంత్ ఆధ్వర్యంలో నరవలో వైద్య, రక్తదాన శిబిరాలను నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన వాల్ పోస్టర్లను మంగళవారం పోస్టర్‌ను ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎం.కనకరాజు, శ్రీను, నూకరాజు, చిన్నారావు, అశోక్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఇక్కడి ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో ఈ నెల 29న రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఫ్లోరా తెలిపారు.

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలి

మల్కాపురం, ఆగస్టు 27: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాలలను వ్యసనాల నుంచి దూరం చేయడం ఎలా అనే అంశంపై ములగాడ మండలంలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో మంగళవారం ఉదయం స్థానిక విజ్ఞాన్ హైస్కూల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రతినిధులు పలు సూచనలు చేశారు. బాల్యం నుంచే బాలలు పాడైపోవడానికి పరిసరా ప్రాంతాల్లో చోటుచేసుకున్న కొన్ని ఘటనలే కారణమవుతాయన్నారు. అంతేకాకుండా ఆ కుటుంబం పూర్తిగా పేదరికంలో ఉండడం, తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలలకు పంపకుండా పనులకు పంపుతుండడం వల్ల చిన్నారుల జీవితాలు నాశనమవుతాని పేర్కొన్నారు. పనులకు వెళ్లడం వల్ల చెడు వ్యసనాలకు బానిసలవుతున్నారన్నారు. అందువల్ల ఉపాధ్యాయులు బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడంలో కీలక పాత్ర పోషించాలని కోరారు. అనంతరం చైల్డ్ లేబర్‌ను ఎలా తగ్గించాలన్న అంశంపై ఒక రోజు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ములగాడ మండల విద్యాశాఖ అధికారులు వి.త్రినాథ్, ఎల్.వెంకటరావు, జీసీడీవో ఖలీషా బేగం, సైకాలజిస్టు పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

హత్యాచార ఘటనను నిరసిస్తూ కొవ్వొత్తుల ప్రదర్శన



కొవ్వొత్తుల ప్రదర్శనలో పాల్గొన్న జై భీమ్, దళిత సంఘాల ప్రతినిధులు

గోపాలపట్నం, ఆగస్టు 27: కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై జరిగిన హత్యాచార ఘటనను నిరసిస్తూ లక్ష్మీనగర్‌లోని నాలుగు కొళాయిల జంక్షన్‌లో జై భీమ్ సంక్షేమ సేవా సంఘం, విశాఖ దళిత సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో కొవ్వొత్తులో ప్రదర్శనను మంగళవారం సాయంత్రం చేపట్టారు. ఈ సందర్భంగా దళిత సంఘాల ఐక్యవేదిక కో-కన్వీనర్ సోడదాసి సుధాకర్ మాట్లాడుతూ కోల్‌కతా ఘటనలో నిందితులను త్వరగా గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇటువంటి అమానుష ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చట్టాలను ప్రభుత్వాలు అమలు చేయాలన్నారు. అనంతరం నాలుగు కొళాయిల జంక్షన్ నుంచి లక్ష్మీనగర్ ప్రధాన రహదారిలో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ప్రతినిధులు బంగారు తలసీరామ్, కె.సంజీవరావు, శ్రీకుమార్, డెంకాడ ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

నగరాభివృద్ధికి అధికంగా నిధులు కేటాయించాలి

మంత్రి నారాయణకు విజ్ఞప్తి చేసిన టీడీపీ నేత వెంకటరమణారెడ్డి



మంత్రి నారాయణ, గంటా శ్రీనివాసరావులతో వెంకటరమణారెడ్డి, తదితరులు

పెదగంట్యాడ, ఆగస్టు 27: ఐదేళ్లుగా అన్ని విధాలుగా నష్టపోయిన విశాఖ నగరాభివృద్ధికి అధిక మొత్తంలో నిధులు కేటాయించవలసిందిగా రాష్ట్ర మునిసిపల్ శాఖా మంత్రి పొంగూరి నారాయణను టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి కోరారు. విశాఖ పర్యటనకు విచ్చేసిన మంత్రిని మంగళవారం ఆయన ఎంవీపీ కాలనీలోని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నిర్వాసిత నిరుద్యోగుల సమస్యలు, పెదగంట్యాడ పారిశ్రామికవాడ అభివృద్ధికి తీసుకోవలసిన చర్యలు, పెదగంట్యాడ మండల శివారు ప్రాంతాల రోడ్లను నగరానికి అనుసంధానం చేయడం వంటి అంశాలను మంత్రికి వివరించారు. అందుకు మంత్రి నారాయణ సానుకూలంగా స్పందించినట్టు రమణారెడ్డి తెలిపారు.

31న ఈపీఎస్-95 పెన్షనర్ల సమావేశం

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 27: ఈపీఎస్-95 పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఈ నెల 31న స్టీల్‌ప్లాంట్ సీ-భవన్‌లో నిర్వహించనున్నట్టు అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు మాటూరి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై చర్చించడంతో పాటు పలు తీర్మానాలు చేయనున్నట్టు పేర్కొన్నారు. పెన్షనర్లందరూ హాజరవ్వాలని కోరారు.

డ్వాక్రా గ్రూపు సభ్యులతో గణబాబు సమావేశం

ఎన్.ఎ.డి.జంక్షన్, ఆగస్టు 27: జీవీఎంసీ 52వ వార్డు పరిధి కరాసాలోని ఓ కల్యాణ మండపంలో మంగళవారం పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు డ్వాక్రా గ్రూప్ సభ్యులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్వాక్రా గ్రూపు మహిళల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా రివాల్వింగ్ ఫండ్, లోన్ పరిమితి, తదితర అంశాలపై గ్రూప్ సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలులిచ్చారు. సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేసిన ఆయా మహిళా సంఘాలకు గణబాబు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏపీడీ చిట్టిబాబు, సీవో ఉషారాణి, టీడీపీ నాయకులు వైటీఆర్, వెంకుమంతి చంద్రశేఖర్, పాల శ్రీను, బుజ్జి, అప్పారావు, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

నర్సింగబిల్లి అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే

జీవీఎంసీ 94వ వార్డు పరిధి నాయుడుతోట రవినగర్‌లో కొలువుదీరిన నర్సింగబిల్లి అమ్మవారి మారువారం పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ఎమ్మెల్యే గణబాబు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో చేపట్టనున్న అభివృద్ధి పనుల గురించి గణబాబుకు కార్పొరేటర్ రాపర్తి కన్నా వివరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మహేశ్, రాజు, బాబీ, తదితరులు పాల్గొన్నారు.

పీఎఫ్ సబ్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలి

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 27: స్టీల్‌ప్లాంటులో విధులు నిర్వహిస్తున్న కార్మికుల కోసం కర్మాగారం పరిసర ప్రాంతాల్లో పీఎఫ్ సబ్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని పలువురు కార్మికులు కోరుతున్నారు. పీఎఫ్ కార్యాలయం ఉక్కు కార్మికులకు అందుబాటులో లేకపోవటంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. ప్లాంటులో సుమారు 11 వేల మంది కాంట్రాక్టు కార్మికులు పని చేస్తున్నారు. వీరిలో ప్రతిఒక్కరికీ పీఎఫ్ అకౌంట్ తప్పనిసరి. అయితే పీఎఫ్ లావాదేవీలకు సంబంధించి ఎలాంటి సమస్యలున్నా నగరంలోని పీఎఫ్ కార్యాలయానికి వెళ్లాల్సి వస్తుందని పలువురు పేర్కొంటున్నారు. ఇందుకోసం ఒకరోజు సెలవు పెట్టాల్సి వస్తుందని వాపోతున్నారు. అందువల్ల ప్లాంట్ పరిసర ప్రాంతాల్లో పీఎఫ్ సబ్ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తే స్టీల్‌ప్లాంటుతో పాటు హిందూజా, చుట్టుపక్కల ఉన్న పలు పరిశ్రమల కార్మికులకు ఎంత ఉపయుక్తంగా ఉంటుందని కార్మిక సంఘాల నాయకులు పేర్కొంటున్నారు.



అమ్మవారికి సారె సమర్పించిన భక్తులు

వైభవంగా పోలమాంబ మారువారం పండగ

మల్కాపురం, ఆగస్టు 27: ఇక్కడి ఎస్సీ కాలనీలో పోలమాంబ అమ్మవారి మారువారం పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సదరంపట్టు వద్ద అమ్మవారికి ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం కాలనీలోకి మహిళలు, యువతలు పురవీధుల్లో సారెను ఊరేగించారు. అనంతరం ఆలయానికి చేరుకుని పోలమాంబకు సారె సమర్పించారు. కార్యక్రమంలో రామ్-రాంజీ సంక్షేమ సంఘం ప్రతినిధులతో పాటు స్థానిక యువకులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాలలో రాణించాలి

అక్కిరెడ్డిపాలెం, ఆగస్టు 27: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక రంగాలలో కూడా రాణించాలని అక్కిరెడ్డిపాలెం హైస్కూల్ ప్రధానోపాధ్యయురాలు ఎంఎల్ఎస్ కాంతం అన్నారు. ఈ నెల 29న జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం పాఠశాలలో విద్యార్థులతో ఆమె క్రీడా ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం హైస్కూల్ ప్రాంగణంలో జరిగిన స్కూల్ జోన్ ఖోఖో పోటీల క్రీడాకారులను పరిచయం చేసుకుని అభినందించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు మహ్మద్ ఇస్మాయిల్, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **మారుతీనగర్ సుబ్రహ్మణ్యం :** సంగం, కామేశ్వరి, సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి), విశేష్ (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **ఆయ్ :** రమాదేవి, వెంకటేశ్వర-2, కిన్నెర, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్-3 (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), రాములమ్మ (తగరపువలస)
- **కమిటీ కుర్రోళ్ళు :** శరత్, శ్రీవెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **డిమోంటీ కోలనీ-2 :** మెలోడి, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), లక్ష్మీకాంత్ (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)
- **తంగలాన్ :** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి).
- **మిస్టర్ బచ్చన్ :** సుకన్య (గోపాలపట్నం), కన్య (గాజువాక), తాతా (తగరపువలస)
- **డబుల్ ఇస్మార్ట్ :** జగదాంబ, శ్రీకన్య (గాజువాక)
- **ఆర్.కె.పురంలో :** శ్రీకాంతి

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 47, టమాటా 26, వంకాయలు (తెలుపు) 46, వంకాయలు (నలుపు) 46, బెండకాయలు 20, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 30, బీరకాయలు 36, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 36, క్యాబేజీ 24, క్యారెట్ 34, దొండకాయలు 24, బంగాళదుంపలు 30, అరటికాయ (పెద్దది) 8, అల్లం (పాతది) 120, మునక్కాడలు (కిలో) 40, బరబాటి 24, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 82, గోరుచిక్కుడు 30, దోసకాయలు 20, వెల్లుల్లి (పెద్దవి) 240, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 68, పొటల్స్ 36, కీరదోస 30, క్యాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 38, చిలగడదుంపలు 48, కంద 58, దేముడుచిక్కుడు 70, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 70, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	91
ఫారం ధర	--	111
విత్ స్కిన్	--	192
స్కిన్‌లెస్	--	202

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..

అభివృద్ధి పనుల పూర్తికి సహకరించండి

రైల్వే అధికారులను కోరిన పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు

గోపాలపట్నం, ఆగస్టు 27: రైల్వే సమస్యల కారణంగా పశ్చిమ నియోజకవర్గంలో నిలిచిపోయిన అభివృద్ధి పనులు పూర్తయ్యే విధంగా సహకరించాలని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు రైల్వే అధికారులను కోరారు. మంగళవారం ఆయన 89, 91, 92 వార్డుల్లో రైల్వే, జీవీఎంసీ అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా వెంకటాపురం ఐదు మదాల మార్గం, గోపాలపట్నం రవీంద్రనగర్ ప్రాంతాల్లో రైల్వే సమస్యల కారణంగా నిలిచిపోయిన రహదారులను గణబాబు పరిశీలించారు. అలాగే ఇటీవల చంద్రనగర్‌లో నిర్మించిన అండర్ పాస్‌వేలో వర్షపు నీరు నిలవకుండా చర్యలు చేపట్టాలని రైల్వే అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఆయా వార్డుల్లో నిర్మాణ దశలో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, ప్రతిపాదనలో ఉన్న పనులను త్వరగా ప్రారంభించడానికి చర్యలు చేపట్టాలని జీవీఎంసీ అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న గణబాబు

చురుగ్గా స్విమ్మింగ్‌పూల్ నిర్మాణ పనులు

జనవరి నెలాఖరుకల్లా అందుబాటులోకి తెచ్చేందుకు అధికారుల ప్రణాళిక

పెదగంట్యాడ, ఆగస్టు 27: జీవీఎంసీ 65వ వార్డు పరిధి వికాస్‌నగర్ రాజీవ్ స్టేడియం సమీపంలో స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు పనులు చురుగ్గా సాగుతున్నాయి. కోటి రూపాయల వ్యయంతో దీనిని నిర్మించేందుకు జీవీఎంసీ అంచనాలు రూపొందించి నిధులు మంజూరు చేసింది. రాజీవ్ స్టేడియానికి వెనక భాగాన విశాలమైన స్థలంలో దీనిని నిర్మిస్తున్నారు. స్విమ్మింగ్ పూల్‌తో పాటు స్విమ్మర్లు వేచివుండేందుకు గాను గదులు, స్విమ్మింగ్ సూట్‌లను మార్చుకునేందుకు ప్రత్యేక గదులను ఏర్పాటు చేస్తున్నారు.

వచ్చే ఏడాది జనవరి నెలాఖరుకల్లా దీనిని అందుబాటులోకి తెచ్చేందుకు ఇంజనీరింగ్ అధికారులు ప్రణాళికాబద్ధంగా కాంట్రాక్టరుతో పనులు చేయిస్తున్నారు. కాగా కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు మంగళవారం స్విమ్మింగ్ పూల్ నిర్మాణ పనులను పరిశీలించారు. నాణ్యత విషయంలో రాజీ పడకుండా పనులు పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు.



స్విమ్మింగ్ పూల్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ బీఎన్ పాత్రుడు

'ఉక్కు' అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి

పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ

కూర్మన్నపాలెం, ఆగస్టు 27: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ అన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీ కరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 1,293వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ ఉక్కుకు గనులు, నిధులను కేంద్రం సమకూర్చాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన అమరావతి, పోలవరం నిర్మాణాల్లో విశాఖ స్టీల్ వినియోగంపై కచ్చితమైన నిర్ణయం తీసుకుని ప్లాంటుకు చేయూతనివ్వాలన్నారు. ఉక్కు పరిరక్షణకు తక్షణమే కేంద్రం ట్యాక్స్ హాలిడేను ప్రకటించాలని పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంటును పూర్తి స్థాయిలో నడిపేందుకు ఉక్కు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఉన్న ఎన్ఎండీసీతో మాట్లాడి ఐరన్ ఓర్, బొగ్గు సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వర్కింగ్ క్యాపిటల్ లేక ముడిసరకు కొనుగోలు చేయకపోవడంతో కర్మాగారంలో ఉత్పత్తి అడుగంటి పోవడంతో ఆందోళన కలిగిస్తోందని ఆదినారాయణ అన్నారు. కేంద్ర ఉక్కు శాఖా మంత్రి ఇచ్చిన హామీ మేరకు ముడిసరకును సరఫరా చేయాలని కోరారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న ఆదినారాయణ

ఉక్కు నిర్వాసితులకు ఉపాధి కల్పించాలి

ఉక్కుటౌన్‌షిప్: విశాఖ ఉక్కు నిర్వాసితులకు ఉపాధి కల్పించాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందని ఇంటక్ ప్లాంట్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ సెంట్రల్ స్టోర్స్ జంక్షన్ వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్లాంట్ నిర్మాణం కోసం సర్వం కోల్పోయిన నిర్వాసితులు ఉపాధి లేక ఇప్పుడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే ప్లాంట్ అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ఉద్యోగుల సంక్షేమం కోసం యాజమాన్యం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఉక్కు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి యాజమాన్యం ముందుకు రావాలని ఆయన కోరారు. కార్మిక సంక్షేమం కోసం చేపట్టే పనులకు తాము సంపూర్ణ సహకారాన్ని అందిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు కారు రమణ, ఎస్‌వి నాయుడు, సాహూ, రాథోడ్, మోహన్, తదితరులు పాల్గొన్నారు.



శ్రీనగర్ ఆలయంలో పుష్పాలంకరణలో శ్రీకృష్ణుడు

వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు

కూర్మన్నపాలెం, ఆగస్టు 27: జీవీఎంసీ 71వ వార్డు పరిధి శ్రీనగర్‌లో శ్రీకృష్ణ, గణపతి, రమా సహిత సత్యనారాయణస్వామి ఆలయంలో మంగళవారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు భూషణశర్మ శ్రీకృష్ణునికి పంచామృతాలతో అభిషేకాలు, అష్టోత్తర శతనామాలతో తులసీ దళార్చన చేశారు. స్వామివారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించగా అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు కె.సహదేవరావు, లక్ష్మణరాజు, శ్రీనివాసరాజు, ఎ.సూర్యనారాయణ, కృష్ణ మునీంద్ర, తదితరులు పాల్గొన్నారు. అలాగే 86వ వార్డు శాతవాహన నగర్‌లోని శ్రీకృష్ణుని ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. శ్రీకృష్ణునికి 108 రకాల పిండి వంటలను నైవేద్యంగా సమర్పించారు. రాసాలమ్మ కాలనీలో గోకుల కృష్ణా యాదవ సంఘం ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు జరిపారు. శ్రీకృష్ణుడిని టీడీపీ 86వ వార్డు ఇన్‌చార్జి నల్లూరు సూర్యనారాయణ, జనసేన ఇన్‌చార్జి కాదా శ్రీను, తదితరులు దర్శించుకున్నారు.

అక్కిరెడ్డిపాలెం: బీహెచ్‌పీవీ ప్రసన్నగిరిపై గల వేంకటేశ్వర వినాయకస్వామి దేవస్థానంలో, శీలానగర్ ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో మంగళవారం కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. వేదపండితులు దివ్యక్షేత్రంలోని బాలాజీని శ్రీకృష్ణునిగా అలంకరించి పూజలు చేశారు. సాయంత్రం ప్రత్యేక వేదికపై శ్రీకృష్ణుని ఉత్సవ విగ్రహాన్ని ఏర్పాటు చేసి వేడుకలను చేపట్టారు. బాలకృష్ణులు, రాధ, గోపిక వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు. ప్రసన్నగిరి వేంకటేశ్వర వినాయక స్వామి దేవస్థానంలో ఉట్టి కొట్టే ఉత్సవంలో భక్తులు పాల్గొన్నారు.

వేపగుంట: నాయుడుతోట రవినగర్ శేషాద్రి కొండపై ఉన్న కల్యాణ వేంకటేశ్వరాలయంలో కృష్ణాష్టమిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఉట్టి కొట్టే ఉత్సవంలో చిన్నారులు, యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. శ్రీలక్ష్మీనరసింహనగర్‌లోని శ్రీగోపీజనవల్లభస్వామి ఆలయంలోనూ వేడుకలు జరిపారు.



బాలాజీ దివ్యక్షేత్రంలో పూజలు చేస్తున్న భక్తులు



శాతవాహన నగర్‌లో పూజలందుకున్న స్వామి

'భూముల ఆక్రమణపై విచారణ జరపాలి'

పెదగంట్యాడ, ఆగస్టు 27: రాష్ట్రంలో ప్రభుత్వ భూముల ఆక్రమణపై సమగ్ర విచారణ జరిపించాలని, ఆక్రమణదారులు ఎంతటి వారైనా వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.సత్యనారాయణ కోరారు. అలాగే పేదలను భయపెట్టి వారి స్థలాలను కబ్జా చేసిన వారిని చట్టం ముందు నిలబెట్టాలని డిమాండ్ చేశారు. ఇక్కడి పోతిన సన్యాసిరావు భవన్‌లో మంగళవారం సీపీఐ పెదగంట్యాడ శాఖ నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విజయవాడలో బుధవారం సీపీఐ ఆధ్వర్యంలో జరగనున్న భూబాధితుల రాష్ట్ర సదస్సును సక్సెస్ చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు యెల్లేటి శ్రీనివాసరావు, పి.పోలయ్య, జి.ఆనంద్, కె.అచ్యుతరావు, పి.దుర్గారావు, కె.పోతన్న, ఎ.విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు. ముందుగా భూబాధితుల రాష్ట్ర సదస్సుకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు.

అన్న సమారాధన

అక్కయ్యపాలెం, ఆగస్టు 27: కృష్ణాష్టమి సందర్భంగా నందగిరినగర్‌లోని గోకుల కృష్ణ దేవాలయం ఆవరణలో మంగళవారం అన్నసమారాధన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా 43వ వార్డు టీడీపీ అధ్యక్షుడు, విశాఖ అర్బన్ జిల్లా ఉపాధ్యక్షుడు బొడ్డేటి మోహన్ హాజరై ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కన్నయ్య, బసవ జయరాం, శివ, చిన్న అప్పారావు, నందగిరి నగర్ కమిటీ సభ్యులు, చెక్కుదురాయి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



హెచ్‌పీసీఎల్‌లో త్వరలో షట్‌డౌన్ పనులు

మల్కాపురం, ఆగస్టు 27: హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్)లో షట్‌డౌన్ పనులు త్వరలో ప్రారంభంకానున్నాయి. సంస్థలో గల మెరాక్స్, ఎఫ్‌సీసీ-1 యూనిట్‌లను శుద్ధి చేసేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నేపథ్యంలో టెండర్లను ఆహ్వానించారు. మెరాక్స్ యూనిట్ పనులను స్థానిక కాంట్రాక్టర్లకు అప్పగించారు. ఎఫ్‌సీసీ-1 యూనిట్ సివిల్ పనులను రేడియంట్ సంస్థకు అప్పగించగా, మెకానికల్ పనులను మరో కాంట్రాక్టరుకు ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. కాగా, ఇప్పటికే షట్‌డౌన్ పనులు ప్రారంభం కావాల్సి ఉండగా, ఎఫ్‌సీసీ-1 యూనిట్ పనులకు సంబంధించిన మెటీరియల్ రాకపోవడం వల్ల ఆలస్యం చోటు చేసుకున్నట్టు తెలిసింది. అయినప్పటికీ ఆయా సంస్థల్లో పనిచేసేందుకు వర్కర్లను తీసుకునే పనులను సంబంధిత కాంట్రాక్టర్లు మొదలు పెట్టారు. సంస్థలో ఏ యూనిట్‌ను షట్‌డౌన్ చేసినా తప్పని సరిగా మెరాక్స్‌ను కూడా షట్‌డౌన్ చేస్తుంటారు. ఈ యూనిట్ సంస్థలో ఎంతో కీలకమైనది కావడంతో ప్రతిసారి దీనిని షట్‌డౌన్ చేస్తుంటారు. కాగా షట్ డౌన్ పనులు సుమారు 45 రోజుల పాటు కొనసాగుతాయి. సుమారు రూ.పది కోట్ల వ్యయంతో ఈ పనులను చేపడుతున్నారు. కాగా 45 రోజులు పాటు పనిచేసే కార్మికులకు సదరు కాంట్రాక్టర్లు ఈఎస్‌ఐ, పీఎఫ్‌లు చెల్లించరన్న ఆరోపణలు ఉన్నాయి.ఒకవేళ వాటిని చెల్లించినా పూర్తి స్థాయిలో చెల్లించరని తెలిసింది.



భద్రతపై కార్మికుల్లో ఆందోళన

కంపెనీలలో వరుస ప్రమాదాలు జరుగుతున్న నేప థ్యంలో హెచ్‌పీసీఎల్‌లో జరగనున్న షట్‌డౌన్ పనులపై కూడా కార్మికులలో ఆందోళన నెలకొంది. ఈ కంపెనీ ఆయిల్ పరిశ్రమ కావడం వల్ల ఎటు వంటి భద్రత కల్పించి పనులు చేపడతారన్న ప్రశ్నలు తలెత్తు తున్నాయి. సాధారణంగా ఆయిల్ పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల పట్ల యాజమాన్యాలు చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. తలపై హెల్మెట్, కాళ్లకు షూ, బాయిలర్ సూట్, కళ్లజోడు, మాస్క్, చేతికి గ్లౌస్‌లతో పాటు అగ్ని ప్రమాదాల సమయాల్లో వినియోగించేందుకు ఫోమ్ వంటి వాటిని ఏర్పాటు చేయాలని పలువురు కార్మికులు కోరుతున్నారు.

ఎసెన్షియాలో రసాయనాల తొలగింపు

- అన్ని శాఖల అధికారులతో కమిటీ ఏర్పాటుచేసిన కలెక్టర్
- డెబ్రిస్ తొలగించాకే గోదాములకు తరలింపు
- వారం రోజులు గడువు కోరిన యాజమాన్యం

అనకాపల్లి/విశాఖపట్నం, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ఆర్థిక మండలిలో ప్రమాదం జరిగిన ఎసెన్షియా ఫార్మా కంపెనీలో రసాయన నిల్వలు జాగ్రత్తగా తొలగించేందుకు అన్ని శాఖల అధికారులతో కలెక్టర్ కమిటీని ఏర్పాటుచేశారు. పరిశ్రమలు, అగ్నిమాపక, ఆర్ అండ్ బి, డ్రగ్ కంట్రోలర్, ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్, బాయిలర్ శాఖల అధికారులతో కలెక్టర్ విజయ కృష్ణన్ మంగళవారం చర్చించారు. ఎసెన్షియా కాంపౌండ్‌లో పది రియాక్టర్లు ఉన్నాయని, వాటిలో ప్రాసెస్ జరుగుతుండగా ప్రమాదం జరిగిందని, వెంటనే వాటిని ఆపేశారని, ఆయా రియాక్టర్లలో రసాయన నిల్వలు ఉండిపోయాయని, జాగ్రత్తగా తరలించాలని సూచించారు. ఈ క్రమంలో ఎవరికీ ఎటువంటి నష్టం జరగకుండా చూడాలన్నారు. బల్క్ డ్రగ్స్, ఇంటర్మీడియట్ మందుల తయారీకి అవసరమైన రసాయన ముడి పదార్థాలు, సాల్వెంట్లు, పౌడర్లను కంపెనీ యాజమాన్యం భారీగా నిల్వ చేసిందని, వాటిని కూడా సంస్థ గోదాములకు సురక్షితంగా తీసుకువెళ్లాలని కలెక్టర్ ఆదేశించారు. దీని కోసం అన్ని శాఖలు ప్రామాణిక ఆపరేటింగ్ విధానం (స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్-ఎస్‌ఓపీ) అనుసరించాలని సూచించారు. ఎవరెవరు ఏమి చేస్తారో క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. ఈ పనులన్నీ చేపట్టాలంటే ముందుగా అక్కడ డెబ్రిస్ తొలగించాలని, మంటలు ఆర్పడానికి వెదజల్లిన నీరు నిల్వ ఉండిపోయిందని, కొన్ని క్యాబిన్లలో రసాయన పొగలు వ్యాపించాయని వాటిని బయటకు పంపడానికి అద్దాలను పగలగొట్టారని అవన్నీ అలాగే ఉన్నాయని, రసాయన పొగకు ఆ ప్రాంతమంతా జిడ్డుగా మారిందని, అవన్నీ క్లియర్ చేస్తే తాము పనులు ప్రారంభిస్తామని అధికారులు వివరించారు. ప్రమాద తీవ్రతకు కంపెనీలో లిఫ్ట్ పాడైపోయిందని, ఇప్పుడు భారీగా ఉన్న నిల్వలు తరలించాలంటే...హైడ్రాలిక్ లిఫ్టులు అవసరమని, అదేవిధంగా నిపుణులు, అనుభవజ్ఞులైన సిబ్బంది అవసరమని అధికారులు చెప్పారు. వీటన్నింటినీ సమకూర్చుకోవడానికి, తరలింపునకు వీలుగా గ్రౌండ్ క్లియర్ చేయడానికి వారం రోజులు సమయం కావాలని యాజమాన్య ప్రతినిధులు కోరారు. వీలైనంత త్వరగా ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్ వారికి సూచించారు.

ఏమేమి ఉన్నాయంటే...

- మొదటి అంతస్థులో సాల్వెంట్ పంపింగ్ చేసిన రియాక్టర్ సామర్థ్యం వేయి లీటర్లు కాగా అందులో ఎంటీబీఈ 700 లీటర్లు ఉందని గుర్తించారు. కింద గ్రౌండ్ ఫ్లోర్‌లోని ట్యాంకర్ సామర్థ్యం పది వేల లీటర్లు కాగా అందులో ఏమున్నా ప్రమాదం లేదని తేల్చారు.
- ప్రమాదానికి కొద్ది సమయం ముందు ఉత్పత్తికి అవసరమైన ముడి పదార్థాలు అన్నింటిని అక్కడకు చేర్చారు. వాటికి ఎటువంటి నష్టం కలగలేదు. వాటిని కూడా తరలించాలని నిర్ణయించారు.
- ప్రమాదం జరిగిన ప్రాంతానికి సమీపంలోనే ముడి పదార్థాల స్టోరేజీ ఏరియా ఉంది. ఆర్డర్‌పై తయారు చేసిన ఇంటర్మీడియట్ మందులన్నీ అక్కడ ఉన్నాయి. వాటిని కూడా గోదాముకు తరలించనున్నారు.
- సుమారు 60 బ్యాచ్‌ల మందుల తయారీకి అవసరమైన ముడి పదార్థాలు, 25 లీటర్ల సామర్థ్యం కలిగిన డ్రమ్ములతో నిల్వ చేశారు. వాటిని కూడా తరలింపు జాబితాలో చేర్చారు.

పీపీఈ కిట్లతో పనులు

ప్రమాదం జరిగిన ప్రాంతం నుంచి రసాయనాలు తొలగించడం రిస్క్‌తో కూడుకున్న వ్యవహారం కాబట్టి, దానివల్ల మరో ప్రమాదం జరగకుండా ముందుగానే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఆ పనుల్లో పాల్గొనే వారందరికీ పర్సనల్ ప్రొటెక్టివ్ ఎక్విప్‌మెంట్ ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. అవసరమైతే ఈ పనులకు నిపుణులను అవుట్ సోర్సింగ్ చేసుకోవాలని సూచించారు.

2 నుంచి బీజేపీ సభ్యత్వ నమోదు


సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, విష్ణుకుమార్‌రాజు

సీతమ్మధార, ఆగస్టు 27: బీజేపీ బలోపేతానికి సెప్టెంబరు 2వ తేది నుంచి చేపట్టనున్న బీజేపీ సదస్యత అభియాన్ (సభ్యత్వ నమోదు)ను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి సూచించారు. ఆమె అధ్యక్షతన విజయవాడలో మంగళవారం ఈమేరకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖ నార్త్ ఎమ్మెల్యే, బీజేపీ ఫ్లోర్ లీడర్, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ, సెప్టెంబరు 2వ తేదీ సాయంత్రం ఢిల్లీలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సభ్యత్వం నమోదు చేసుకుని ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. దేశ వ్యాప్తంగా పార్టీ బలోపేతానికి చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రులు భూపతిరాజు శ్రీనివాస్‌వర్మ, వర్మ, రాష్ట్ర మంత్రి వై.సత్యకుమార్, ఎంపీలు, ఎమ్మెల్యేలతోపాటు ఆ పార్టీ జాతీయ సహ సంఘటన మంత్రి శివప్రకాశ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు బోధనేతర పనులు వద్దు: యూటీఎఫ్

అక్కయ్యపాలెం, ఆగస్టు 27: ఉపాధ్యాయులకు బోధనేతర పనులనుంచి పూర్తిస్థాయిలో మినహాయించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు, టీఆర్ అంబేద్కర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా ఉప విద్యాశాఖాధికారిని కె.సువర్ణను చినగదిలిలోని విద్యాశాఖ కార్యాలయంలో మంగళవారం కలిసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ పలు పోరాటాలు చేసిన ఫలితంగా ప్రస్తుత ప్రభుత్వం మరుగుదొడ్లకు ఫొటోలు తీసే బాధ్యత నుంచి ఉపాధ్యాయులను తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. కానీ, ఈ ఫొటోలు స్కూల్ మేనేజ్‌మెంట్ చైర్మన్ (ఎస్ఎంసీ) వెల్ఫేర్ అసిస్టెంట్లతో తీయించాలని సూచించదన్నారు. అలాగే, ప్రతి రోజూ సాయంత్రం పది అంశాలతో కూడిన గూగుల్ ఫామ్ పూర్తి చేసి ప్రధానోపాధ్యాయులు అప్‌లోడ్ చేయాలని పేర్కొన్నట్టు తెలిపారు. ఎస్ఎంసీ సభ్యులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు మరుగుదొడ్ల ఫొటోలు తీయకుంటే ప్రధానోపాధ్యాయులు దానికి బాధ్యత వహించాలని జీవోలో పేర్కొనడం తగదన్నారు. మరుగుదొడ్ల ఫొటోలు తీసే బాధ్యతలను తొలగించారని భావిస్తున్న తరుణంలో మరింత భారాన్ని పెంచేలా ఉత్తర్వులివ్వడంపై వారు ఖండించారు. వినతి పత్రం సమర్పించిన వారిలో యూటీఎఫ్ కోశాధికారి కె. రాంబాబు, కార్యదర్శులు ఉప్పాడడ రాము, రియాజ్ అహ్మద్, పెందుర్తి మండల అధ్యక్షులు అప్పలరాము తదితరులు ఉన్నారు.


వినతి పత్రం అందిస్తున్న యూటీఎఫ్ నాయకులు

భైరవకోన వద్ద భక్తులకు వసతులు కల్పించాలి: కలెక్టర్

మహరాణిపేట, ఆగస్టు 27: సింహాచలం సమీపంలోని భైరవకోన వద్ద భక్తులకు కనీస వసతులు కల్పనతోపాటు, వారికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. మంగళవారం సింహాచలం ఈవో శ్రీనివాసమూర్తి ఇతర అధికారులు కలెక్టర్‌ను కలిసి భైరవకోన స్థితిగతులను వివరించారు. అమావాస్య రోజు భక్తుల రద్దీ ఇతర అంశాలను తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ భక్తులకు కల్పించాల్సిన పలు వసతులపై సూచనలిచ్చారు. తాగునీరు, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు గస్తీ ఏర్పాటు చేయాలన్నారు.

జిల్లా ఉపాధి కార్యాలయంలో 30న జాబ్‌మేళా

కంచరపాలెం, ఆగస్టు 27 : కంచరపాలెంలోని జిల్లా ఉపాధికార్యాలయంలో ఈనెల 30వ తేదీ శుక్రవారం జాబ్‌మేళాను నిర్వహించనున్నట్టు జిల్లా ఉపాధికల్పనాధికారి సీహెచ్.సుబ్బిరెడ్డి పేర్కొన్నారు. ఈ మేళాలో అమెజాన్, సినర్జీస్ క్యాస్టింగ్, వరుణ్‌మోటార్స్, రిలయన్ నిపాస్ లైఫ్ ఇన్సూరెన్స్, మెడ్‌ప్లస్ ఫార్మా తదితర ఎనిమిది ప్రముఖ కంపెనీలు పాల్గొననున్నాయి. పది, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, డిప్లొమా, ఫార్మసీ కోర్సులు పూర్తిచేసిన నిరుద్యోగులు మేళాలో పాల్గొనవచ్చును. అభ్యర్థులు ముందుగా తమ వివరాలను నేషనల్ కెరియర్ సర్వీస్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్లు చేసుకోవాల్సి ఉంటుంది. ఆసక్తి గల వారు 30న అన్ని ధ్రువపత్రాలతో కార్యాలయంలో జరగనున్న ఇంటర్వ్యూలకు ఉదయం 9గంటలకు హాజరు కావాలని సుబ్బిరెడ్డి సూచించారు.

నాగేశ్వరరావుకు అభినందన

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఆగస్టు 27: ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో స్థానం పొందిన నగరానికి చెందిన చెల్లుబోయిన నాగేశ్వరరావును మిజోరం గవర్నర్ కంభంపాటి హరిబాబు మంగళవారం తన నివాసంలో అభినందించారు. జిల్లా మలేరియా కార్యాలయంలో నాగేశ్వరరావు ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తూ క్రీడలపై ఆసక్తితో గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో ప్రతిభ గల వర్ధమాన ఔత్సాహికులను గుర్తించి ప్రోత్సహిస్తున్నారు. ఈ సేవల నేపథ్యంలో ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో చోటు దక్కడంపై ఆయనను ప్రత్యేకంగా అభినందించారు.


నాగేశ్వరరావును అభినందిస్తున్న మిజోరాం గవర్నర్ హరిబాబు

ఎక్సైజ్‌లో కలెక్షన్ కింగ్

... 5వ పేజీ తరువాయి

చక్రం తిప్పుతున్న ఈ అధికారికి అస్మదీయులైన బార్‌ల నిర్వాహకులు లైసెన్స్ ఫీజు కొన్నినెలలు ఆలస్యంగా చెల్లించినా వారికి సరకు సరఫరా చేసేస్తున్నారని కొంతమంది బార్‌ల నిర్వాహకులు ఆరోపిస్తున్నారు. బీచ్‌రోడ్డులోని ఓ బార్ నిర్వాహకుడు గత ఏడాది ఆగస్టులో లైసెన్స్ ఫీజు చెల్లించకుండా ఆరు నెలల తర్వాత ఈ ఏడాది ఫిబ్రవరిలో రూ.75 లక్షలు చెల్లించారు. కానీ ఆ బార్‌కు మద్యం సరఫరా ఆగలేదు. సదరు అధికారి తీరుపై కొంతమంది బార్‌ల నిర్వాహకులు ధైర్యంగా నిలదీయడంతోపాటు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ దశలో తాను ఓ మంత్రికి బంధువునని, తనను ఎవరూ ఏమీ చేయలేరని, పైగా కొత్త ఇబ్బందులు ఎదురవుతాయని బెదిరిస్తుండడంతో వారంతా మిన్నకుండిపోతున్నట్టు ఎక్సైజ్ శాఖ సిబ్బందే చెబుతున్నారు. ఈ నేపథ్యంలో సదరు అధికారి తీరు కొంతమంది కూటమి ప్రజాప్రతినిధుల దృష్టికి చేరడంతో వారు ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకువెళ్లే యోచనలో ఉన్నట్టు తెలిసింది.

కనకమహాలక్ష్మికి అష్టదళపద్మారాధన

జగదాంబ కూడలి, ఆగస్టు 28: కనకమహాలక్ష్మికి అష్టదళపద్మారాధన సేవలను మంగళవారం నిర్వహించారు. 108 స్వర్ణపుష్పాలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. ఈపూజల్లో ఉభయదాతలు, ఆలయ అధికారులతోపాటు భక్తులు పాల్గొన్నా రు. శ్రావణమాసోత్సవాల్లో భాం గా అమ్మవారిని శ్రావణలక్ష్మి కొలుస్తూ కుంకుమపూజలను జరిపారు,

ప్రజోపయోగ పనులే చేపట్టండి

... 5వ పేజీ తరువాయి


తాత్సారం చేయడం తగదని, ఈ విషయంలో ఫిర్యాదులు రాకూడదని హెచ్చరించారు. ప్రతి పనికీ నిర్దేశిత సమయం ఉందని, ఆ గడువులోగా పూర్తిచేయాలన్నారు. ప్రజల్ని పదేపదే కార్యాలయాలకు వచ్చేలా చేయడం తగదన్నారు. జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ ఆస్తుల పరిరక్షణ, రహదారుల విస్తరణ, ఆక్రమణలు, పార్కింగ్ సమస్యలు, అనధికార నిర్మాణాలు, లేఅవుట్లు, హాకర్ జోన్లు, వెండింగ్ జోన్లపై చర్చించారు. పీపీపీ విధానంలో ఎవరు ఏయే పనులు చేపట్టారో అడిగి తెలుసుకున్నారు. ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టు, ఫ్లైఓవర్లు, బస్సు షెల్టర్లు, ఫ్యూయల్ స్టేషన్లు, ల్యాండ్ మానిటైజేషన్, ముడసర్లోవలో ఎమ్యూజ్‌మెంట్ పార్కు, నీటి సరఫరా ఆటోమేషన్ పనులు, స్టేడియాలు, స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లు, ఎలక్ట్రిక్ వాహనాల చార్జింగ్ స్టేషన్ల గురించి జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ వివరించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ రహదారులపై సెంటర్ మీడియన్‌లో ఉన్న ప్రకటనల బోర్డులు తొలగించాలని ఆదేశించారు. జోన్ల పరిధిలో భవన నిర్మాణాలకు అనుమతులు ఎందుకు ఆలస్యం అవుతున్నాయని ప్రశ్నించారు. త్వరలో ఈ అంశాలన్నింటిపైనా వీడియో కాన్ఫరెన్స్ పెట్టి వివరంగా చర్చిస్తానన్నారు.


చెరువుల మధ్య నుంచి రహదారులా!?

వీఎంఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్‌ను వైసీపీ నాయకులు వారికి నచ్చినట్టుగా మార్చుకున్నారని అనేక ఫిర్యాదులు ఉన్నాయని, చెరువుల మధ్య నుంచి మాస్టర్ ప్లాన్ రహదారులు వేశారని తన దృష్టికి వచ్చిందని, వాటన్నింటిపై త్వరలో ప్రత్యేక సమీక్ష నిర్వహిస్తామని మంత్రి నారాయణ తెలిపారు. అలాగే వీఎంఆర్‌డీఏ ఆర్థిక పరిస్థితి అంత బాగా లేనందున ప్రాజెక్టులను పీపీపీ విధానంలో చేపట్టాలని సూచించామన్నారు.

ప్రజా ప్రతినిధులతో భేటీ

అధికారులతో సమీక్ష ముగిసిన తరువాత జిల్లాలోని ప్రజా ప్రతినిధులు ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, గణబాబు, వంశీకృష్ణ, పంచకర్ల రమేశ్‌బాబు, బండారు సత్యనారాయణమూర్తి, ఎమ్మెల్సీలు దువ్వారపు రామారావు, వేపాడ చిరంజీవిరావు, జీవీఎంసీలో పార్టీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావులతో సమావేశం నిర్వహించారు. వీఎంఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్, ఫ్లైఓవర్ వంతెనలు, ఓపెన్ కాలువలు, సివరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంటు, అండర్ గ్రౌండ్ కాలువలు, 24/7 నీటి సరఫరా, స్మార్ట్ సిటీ అభివృద్ధి పనులపై చర్చించారు. గత ప్రభుత్వం స్వచ్ఛ భారత్ నిధుల వినియోగంలో విఫలమైందని, కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.2,790 కోట్లు రాష్ట్రానికి విడుదల కాలేదని మంత్రి చెప్పారు. దాంతో పురపాలక సంఘాల్లో అభివృద్ధి పనులు పూర్తిగా కుంటుపడ్డాయన్నారు. వచ్చే నాలుగు నెలల్లో ఆర్థిక స్థితిని పూర్తిగా మెరుగుపరుస్తామన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్లు రవీంద్ర, వర్మ, రమణమూర్తి, వినయకుమార్, సురేశ్, శ్రీనివాసరావు, ఫణిరామ్ పాల్గొన్నారు.







ఉపాధ్యాయ సంఘ నేతలకు నివాళి


నేతల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

అక్కయ్యపాలెం, ఆగస్టు 27 : సీనియర్ రాష్ట్ర ఉపాధ్యాయ నేత సింగరాజు రామకృష్ణయ్య, ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యాయ నేత గులిపల్లి సింహాద్రప్పుడు వర్ధంతి కార్యక్రమాన్ని 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ నాయకులు వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరావు, పీఈ టీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎ.సునంద్, సీతమ్మధార మండల అధ్యక్ష, కార్యదర్శులు దేముడు బాబు, పీఎస్ రెడ్డి, రాజు, కేఎన్‌వీ రమణ, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ డిస్పెన్సరీ వితరణ

అక్కయ్యపాలెం, ఆగస్టు 27: గ్రేటర్ 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని భవిత కేంద్రానికి లయన్స్ క్లబ్ సభ్యులు రూ.12వేల విలువ గల చల్లని, వేడి నీరు, నార్మల్ నీరువచ్చే వాటర్ డిస్పెన్సరీ పరికరాన్ని మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు రామారావు, బాలామణి, లయన్స్ క్లబ్ గవర్నర్, భవిత కేంద్రం ఉపాధ్యాయులు శారద, జగదాంబ పాల్గొన్నారు.

గ్రీన్‌బెల్ట్‌లో వైఎస్ విగ్రహం తొలగింపు

టీడీపీ నేతల ఫిర్యాదుతో జీవీఎంసీ చర్యలు

విశాఖపట్నం, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): అక్కయ్యపాలెం జంక్షన్‌లో జాతీయ రహదారికి(గ్రీన్‌బెల్ట్) ఆనుకుని అనుమతిలేకుండాఏర్పాటుచేసిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్. రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని జీవీఎంసీ అధికారులు సోమవారం అర్ధరాత్రి తరువాత తొలగించారు. ఆదివారం రాత్రి స్థానిక కార్పొరేటరు బానాల శ్రీనివాసరావు మరికొందరు వైసీపీ నేతలు హడావిడిగా రాజశేఖరరెడ్డి విగ్రహంపెట్టారు. సోమవారం ఉదయం టీడీపీ నాయకులు గుర్తించి, జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన ఫిర్యాదు మేరకు జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ ఆదేశాలతో టౌన్‌ప్లానింగ్ అధికారులు రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని తొలగించారు. పబ్లిక్ రోడ్లు, పేవ్‌మెంట్లు పక్కన, ఇతర ప్రజా ప్రయోజనాలున్న ప్రాంతాల్లో విగ్రహాలు ఏర్పాటు చేయరాదని జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ సురేష్‌కుమార్ ఈ సందర్భంగా తెలిపారు.


అక్కయ్యపాలెం జంక్షన్‌లో తొలగించిన విగ్రహం

100 అడుగుల పోల్ ఏమైంది?

విగ్రహం ఏర్పాటుచేసిన చోటే గత ఏడాది జీవీఓంపీ నిధులతో 100 అడుగుల పొడవైన వైసీపీ జెండాను ఆవిష్కరించారు. ప్రభుత్వం మారిన తరువాత జెండాను తొలగించారు. అయితే, ఆదివారం వరకు పోల్ ఉండేది. అదేరోజురాత్రి వైఎస్ విగ్రహం ఏర్పాటుచేసే సమయంలో అక్కడున్న పోల్‌ను తొలగించారు. దీనిపై చర్చ సాగుతుంది. వైసీపీ నేతలు పోల్‌ను తీసుకెళ్లారని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు.

వైసీపీ నేతల నిరసన

వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని కక్షపూరితంగా కూలగొట్టిన కూటమి నాయకులను అరెస్ట్ చేయాలని జీవీఎంసీ ఫ్లోర్‌లీడర్, 44వ వార్డు కార్పొరేటర్ బానాల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మంగళవారం వైసీపీనాయకులతో కలిసి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలగొట్టిన వైఎస్సార్ విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కటుమూరి సతీష్, కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్‌రాజు, బర్కత్ ఆలీ, బొడ్డేటి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అయోమయంలో విద్యార్థుల భవితవ్యం

... 5వ పేజీ తరువాయి

పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే పరీక్షలకు హాజరయ్యారు. ప్రస్తుతం 10వ తరగతిలోకి రావడంతో తప్పనిసరిగా సీబీఎస్ఈ బోర్డు పరిధిలో వచ్చే ఏడాది జరగనున్న పబ్లిక్ పరీక్షలు రాయాల్సి ఉంది. దీంతో విద్యార్థులు ఎంతవరకు సీబీఎస్ఈ సిలబస్ ఆకళింపు చేసుకుంటున్నారు?...అనే విషయం తెలుసుకునేందుకు ఈనెల 21వ నుంచి 24వ తేదీ వరకు ఇంగ్లీష్, గణితం, సైన్స్ సోషల్ స్టడీస్‌లలో పరీక్షలు ఆన్‌లైన్‌లో నిర్వహించారు. ప్రతి సబ్జెక్టులో 50 మార్కులకు 50 ప్రశ్నలతో ప్రశ్నపత్రం రూపొందించారు. పరీక్ష రాయడానికి ట్యాబ్‌లు ఇచ్చారు. తరువాత ప్రశ్నపత్రాలను మదింపుచేసిన పాఠశాల విద్యాశాఖ ఫలితాలు చూసి షాక్ తిన్నది. సీబీఎస్ఈలో 33 శాతం మార్కులు వస్తేనే ఉత్తీర్ణత సాధించినట్టు. అయితే 80 మార్కులు థియరీ, 20 మార్కుల ప్రాక్టికల్స్ ఉంటాయి. రెండింటిలో 33 శాతం సాధించాలి. దీంతో తాజా పరీక్షలలో కనీసం 40 మార్కులను పాస్ మార్కులుగా నిర్ణయించారు. అంటే 40 శాతం కంటే తక్కువ వస్తే పరీక్ష తప్పినట్టే. జిల్లాలో 2,203 మందికి పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లుచేయగా ఇంగ్లీష్‌కు 1,977 మంది హాజరయ్యారు. వారిలో 1,627 మందికి 40 శాతం కంటే తక్కువ మార్కులు వచ్చాయి. మరో 295 మంది 41 నుంచి 60 శాతం, 51 మంది 61 నుంచి 80 శాతం, ముగ్గురు మాత్రమే 81 శాతం మార్కులు తెచ్చుకున్నారు. గణితం పరీక్షకు 2,173 మంది హాజరుకాగా 1,374 మందికి 40 శాతం కంటే తక్కువ మార్కులు వచ్చాయి. 505 మంది 41 నుంచి 60 శాతం, 288 మంది 61 నుంచి 80 శాతం, ఆరుగురు 81 శాతం మార్కులు తెచ్చుకున్నారు. సైన్స్ పరీక్ష 2,175 మంది రాయగా 1,193 మందికి 40 శాతం కంటే తక్కువ మార్కులు వచ్చాయి. 677 మంది 41 నుంచి 60 శాతం, 286 మంది 61 నుంచి 80 శాతం, 19 మంది 81 శాతం కంటే ఎక్కువ మార్కులు తెచ్చుకున్నారు. సాంఘిక శాస్త్రం పరీక్షకు 2167 మంది హాజరుకాగా 1,245 మందికి 40 శాతం కంటే తక్కువ మార్కులు వచ్చాయి. మరో 627 మంది 41 నుంచి 60 శాతం, 201 మంది 61 నుంచి 80 శాతం, 94 మంది 81 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించారు. తాజా ఫలితాల నేపథ్యంలో సీబీఎస్ఈ బోర్డు నిర్వహించే పరీక్షలకు విద్యార్థులను ఏ విధంగా సన్నద్ధం చేయాలో అర్థంకావడం లేదని విద్యా శాఖ అధికారులు అంటున్నారు.

మంత్రి గరంగరం

... 5వ పేజీ తరువాయి

దాని పరమార్థం ఏమిటని ప్రశ్నించారు. దీనిని ప్రజలు వేధింపుగా భావిస్తున్నారన్నారు. తన దృష్టికి వచ్చిన పలు ఫిర్యాదులను ఆయన సమీక్షలోనే ప్రశ్నించారు. ఆరు నెలల నుంచి అనుమతి ఇవ్వకుండా తిప్పుతున్నారని ఐదుగురు వ్యక్తులు వేర్వేరుగా ఫిర్యాదు చేయగా వారిని సమావేశానికి పిలిచి, దానికి కారణం ఏమిటో సంబంధిత అధికారితో చెప్పించారు. వాటికి రెండు మూడు రోజుల్లోనే క్లియరెన్స్ ఇవ్వాలని ఆదేశించారు. అలాగే వీఎంఆర్‌డీఏలో కూడా లేఅవుట్ల అనుమతులు ఇవ్వడం లేదని కొందరు చేసిన ఫిర్యాదులపై విచారణ చేశారు. ఇకపై ఏ అధికారి అయినా దరఖాస్తుదారుకు రెండో షార్ట్ ఫాల్ ఇచ్చినట్టయితే అది నేరుగా సంబంధిత శాఖ హెచ్‌ఓడీకి వెళ్లేలా సాఫ్ట్‌వేర్ మారుస్తామని, ఆపై ఆటలు సాగవని స్పష్టంచేశారు. అవసరమైతే దీనిపై టాస్క్ ఫోర్స్ పెడతామని, నిబంధనల ప్రకారం పని జరిగిపోవాలన్నారు. జీవీఎంసీలో భూగర్భ డ్రైనేజీ కనెక్షన్లను ప్రజలు ఎందుకు తీసుకోవడం లేదని మంత్రి ప్రశ్నించారు. ఫీజులు ఎంత వసూలు చేస్తున్నారంటూ వివరాలు అడిగారు.

గుట్టుగా శిశువుల విక్రయాలు

... 5వ పేజీ తరువాయి

పరిస్థితులను గమనిస్తారు. వారికి డబ్బు ఆశ చూపిస్తారు. బిడ్డ పుట్టేంత వరకు వారి బాగోగులు చూసుకుంటారు. అందుకు అవసరమైన ఖర్చులు సమకూరుస్తారు. బిడ్డ పుట్టిన తరువాత మిగిలిన మొత్తాన్ని చెల్లించి తీసుకువెళుతుంటారు. ముఖ్యంగా ఇతరులతో సంబంధం లేని వారిని మాత్రమే ఇలాంటి వాటికి ఎంపిక చేసుకుంటారు. అదేవిధంగా రక రకాల కారణాలతో బిడ్డను వద్దనుకునే వారిని కూడా ట్రాప్ చేస్తారు. ఇదంతా ప్రణాళిక ప్రకారం సాగించే వ్యవహారం. ఇలాకాకుండా కొన్నిచోట్ల చిన్నారులను ఆస్పత్రులు, లేబర్ రూముల నుంచి దొంగతనం చేసి విక్రయించేవారున్నారు.

అధికారికంగా దత్తత

పిల్లలు లేని దంపతులు అనధికారికంగా ఇలా చిన్నా రులను కొనుగోలు చేయడం నేరమని బాలల సంక్షేమ శాఖ అధికారులు చెబుతున్నారు. ఎవరైనా పిల్లలు కావాలనుకుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా దత్తత ఇస్తున్నాయని, ఇందుకోసం కారా పేరుతో వెబ్‌సైట్ ఉందని చెబుతున్నారు. ఇందులో రిజిస్ట్రేషన్ చేసుకోవడం ద్వారా తమకు కావా లనుకునే బాలిక/బాలుడిని దత్తత తీసుకోవచ్చునంటు న్నారు. నిబంధనలకు విరుద్ధంగా చిన్నారులను కొనుగోలు చేస్తే చట్టపరంగా ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఏయూ రిజిస్ట్రార్


రిజిస్ట్రార్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

వెంకోజీపాలెం, ఆగస్టు 27: ఏయూ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టిన ఆచార్య ఇ.ఎన్. ధనుంజయరావు మంగళవారం తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబును మర్యాద పూర్వకంగా కలిశారు. ఏయూ అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్‌ను ఎమ్మెల్యే అభినందించారు.

రిజిస్ట్రార్‌కు అభినందనల వెల్లువ

వెంకోజీపాలెం: ఏయూ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టిన ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావుకు మంగళవారం ఆచార్యులు, ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు. మాజీ వీసీ జి.ఎస్.ఎన్.రాజు, ఐఐపీఈ మాజీ డైరెక్టర్ వి.ఎస్.ఆర్.కె.ప్రసాద్, ప్రిన్సిపాల్ ఎ.నరసింహారావు, జి.గిరిజా శంకర్, సీతామాణిక్యం, గ్రంథాలయ సిబ్బంది, విశ్రాంత బోధనేతర ఉద్యోగుల సంఘం సభ్యులు, విశ్రాంత ఆచార్యులు, డీన్‌లు, కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు, విభాగాధిపతులు, తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

వ్యాపార సముదాయాల వేలం వాయిదా

భీమునిపట్నం, ఆగస్టు 27: భీమిలి జోనల్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన జీవీఎంసీ ఆస్తుల గుత్తకు నిర్వహించిన బహిరంగ వేలానికి పాటదారులనుంచి స్పందనరాలేదు. దీంతో జోనల్ కమిషనర్ కె.కనకమహాలక్ష్మి ఈ వేలంను ఈనెల 29వ తేదీకి వాయిదా వేసినట్టు ఆఫీసు సూపరింటెండెంట్ ఎస్.శ్రీనివాసరావు విడుదల చేసిన ఒక ప్రకటన తెలిపారు. బీచ్‌రోడ్‌లో జిప్లస్‌వన్ షాపు రూం, మీసేవ కేంద్రంపై భాగంలోని గదికి మూడేళ్ల లీజుకు, భీమిలి మెయిన్‌రోడ్, లాల్‌బహదూరుశాస్త్రి మార్కెట్, కలిగొట్ల సూర్యనారాయణనాయుడు మార్కెట్‌లో ఆశీలు వసూల వేలం నిర్వహించారు.ఎవరూ రాకపోవడంతోవాయిదా వేశారు.

వైద్య శిబిరానికి స్పందన

పద్మనాభం (రూరల్), ఆగస్టు 27: మండలంలోని మద్ది గ్రామంలో పలువురు జ్వరాలతో బాధపుతుండడంతో మంగళవారం ఎంపీపీ కె. రాంబాబు ఆదేశాలమేరకు రేవిడి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది వైద్యశిబిరం నిర్వహించారు. స్థానిక వెల్నెస్ సెంటర్‌లో రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు విడుదల

పద్మనాభం(రూరల్), ఆగస్టు 27: మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు రూ. 30 లక్షలు మంజూరైనట్టు జడ్పీ వైస్ ఛైర్మన్ సుంకరి గిరిబాబు తెలిపారు. మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తొమ్మిది గ్రామాల్లో తాగునీటి సౌకర్యార్థం బోర్లు ఏర్పాటు చేస్తామన్నారు. పది గ్రామాల్లో సీసీ రహదారులు, కాలువలు నిర్మిస్తామన్నారు. రెండు గ్రామాల్లో సామాజిక భవనాలు నిర్మించనున్నట్టు వివరించారు. ఎంపీపీ కె.రాంబాబు, కె.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

వీఆర్వో పోస్టులకు పైరవీలు

పద్మనాభం(రూరల్), ఆగస్టు 27: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న కొంతమంది వీఆర్వోలు బదిలీలు నిలిపివేసుకునేందుకు యత్నిస్తున్నారు. వీరు తహసీల్దార్లను గుప్పిట పెట్టుకుని అక్రమార్జనకు చిరునామాగా మారారనే ఆరోపణలున్నాయి. ఆరేళ్లుగా ఇక్కడే పనిచేయడంతో భూముల వ్యవహారాలన్నీ వీరికి కొట్టినపిండి. దీంతో ఇదే మండలంలో పనిచేసేందుకు మొగ్గుచూపుతున్నారు.గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కొంతమంది నేతలకు ప్రభుత్వ భూములను దోచిపెట్టడంలో వీరి పాత్ర కీలకమనే విమర్శలున్నాయి. వారికి ఇప్పటికీ వైసీపీ నేతల అండ ఉందని, బదిలీలను అడ్డుకోవడానికి టీడీపీ నేతలతో రాయబారం నెరుపుతున్నారని సమాచారం.

సినిమా గైడ్

- **మారుతీనగర్ సుబ్రహ్మణ్యం :** సంగం, కామేశ్వరి, సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి), విశేష్ (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **ఆయ్ :** రమాదేవి, వెంకటేశ్వర-2, కిన్నెర, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్-3 (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), రాములమ్మ (తగరపువలస)
- **కమిటీ కుర్రోళ్లు :** శరత్, శ్రీవెంకటేశ్వర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **డిమోంటీ కోలనీ-2 :** మెలోడి, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), లక్ష్మీకాంత్ (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)
- **తంగలాన్ :** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి).
- **మిస్టర్ బచ్చన్ :** సుకన్య (గోపాలపట్నం), కన్య (గాజువాక), తాతా (తగరపువలస)
- **డబుల్ ఇస్మార్ట్ :** జగదాంబ, శ్రీకన్య (గాజువాక)
- **ఆర్.కె.పురంలో :** శ్రీకాంతి

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 47, టమాటా 26, వంకాయలు (తెలుపు) 46, వంకాయలు (నలుపు) 46, బెండకాయలు 20, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 30, బీరకాయలు 36, ఆనపకాయలు 16, కాలీఫ్లవర్ 36, క్యాబేజి 24, క్యారెట్ 34, దొండకాయలు 24, బంగాళదుంపలు 30, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 40, అల్లం (పాతది) 120, బరబాటి 24, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 82, గోరుచిక్కుడు 30, దోసకాయలు 20, వెల్లుల్లి (పెద్దవి) 240, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 68, పొటల్స్ 36, కీరదోస 30, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 38, చిలగడదుంపలు 48, కంద 58, దేముడు చిక్కుడు 70, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 70, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)
(వంద - రూ.లలో)

విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

చికెన్ ధరలు
బ్యాగ్

రైతు ధర	--	91
ఫారం ధర	--	111
విత్ స్కిన్	--	192
స్కిన్‌లెస్	--	202

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..

ప్రజా ధనం సర్వే రాళ్ల పాలు

- గ్రామాల్లో అస్తవ్యస్తంగా భూ సర్వే
- జగన్ ప్రభుత్వ ప్రచార వ్యామోహంతో వృథాగా మారిన నిధులు
- ఎక్కడికక్కడ పోగుపడిన సర్వే రాళ్లు


పద్మనాభం మండలంలో నిల్వ చేసిన సర్వే రాళ్లు

పద్మనాభం(రూరల్), ఆగస్టు 27: వైసీపీ ఐదేళ్ల పాలనలో ప్రజాపయోగం కంటే ప్రచారానికే అధిక ప్రాధాన్యం ఇచ్చారు. ఇందుకు గ్రామాల్లో రీ సర్వేపేరిట తీసుకువచ్చిన రాళ్లు నిదర్శంగా నిలుస్తున్నాయి. రూ. లక్షలు వ్యయం చేసి కొనుగోలు చేసిన ఈ రాళ్లు ప్రస్తుతం నిరుపయోగంగా మయ్యాయి. జగన్ ఫొటో, పేరుతో ముద్రించిన ఈ సర్వేరాళ్లు పొలాల్లో ఎక్కడిక్కడ కనిపిస్తున్నాయి. భీమిలి నియోజకవర్గంలో మూడు మండలాల్లో అన్ని గ్రామాల్లో రీ సర్వే మాట ఎలా ఉన్నా రాళ్ల కోసం వెచ్చిన సొమ్ము మాత్రం బూడిదలో పోసిన పన్నీరుగా మారింది. కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలు మేరకు రీసర్వే కే పరిమితం కావాలి. కానీ, ప్రచారం కోసం జగన్ ప్రభుత్వం అత్యుత్సాహంతో సర్వే రాళ్ల అంశాన్ని తెరపైకి తీసుకువచ్చి ప్రజా సొమ్ము వృథాగా చేసిందన్న ఆరోపణలు వినిపిస్తున్నారు. ఖర్చు విషయంలో పారదర్శత పాటించకుండా వెచ్చించినట్టు ఆరోపణలు అప్పట్లో వ్యక్తమయ్యాయి. ఒక్కో రాయికి రూ.150 మాత్రమేనని తొలుత ప్రకటించి.. తర్వాత రవాణా, రంగులు తదితర ఖర్చులపేరిట రూ.250 వరకు వ్యయంచేసినట్టు తెలుస్తోంది. సర్వే రాళ్ల పేరిట వైసీపీ నేతల జేబులు నింపినట్టు విమర్శలు వచ్చాయి. భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల్లో సుమారు 140 గ్రామాల్లో జగన్ పేరుతో ఉన్నరాళ్లను కేటాయించగా...ఇప్పటికే 81 గ్రామాల్లో ఈ రాళ్లను పాతారు. సర్వే రాళ్లను ఏ క్లాస్ స్టోన్స్, బిక్లాస్ స్టోన్స్ గా విభజించారు.

వైసీపీ నేతల కనుసన్నల్లోనే రీసర్వే...

భూముల రీ సర్వే ఘట్టం మొత్తం ఓ ప్రహసనంగా సాగింది. నియోజకవర్గంలో రీ సర్వే పూర్తయిన 81 గ్రామాల్లో రైతుల నుంచి వచ్చిన అభ్యంతరాలు 150 వరకు ఉన్నట్టు సమాచారం. గ్రామాల్లో వైసీపీ నేతల కనుసన్నల్లోనే ఇది జరగడంతో వారి అనుకూలురకు ఒకలా.. ప్రత్యర్థి పార్టీ శ్రేణుల విషయంలో మరోలా వ్యవహరించారు. కొద్ది పాటి గల రైతు పొలంలోనే పది నుంచి 20 సెంట్ల వరకు రీసర్వేలో వల్ల కోల్పోవాల్సిన వచ్చిందని అప్పట్లో రైతులు వాపోయారు. తమ తమ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా వైసీపీ నేతల కనుసన్నల్లోనే ఈ తతంగాన్ని నడిపించినట్టు ఆరోపిస్తున్నారు.

అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

- భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు


జెండా ఊపి బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

కొమ్మాది, ఆగస్టు 27: అభివృద్ధి, సంక్షేమం రెండుకళ్లుగా తమ ప్రభుత్వం ముందుకు సాగుతోందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం మధురవాడ డిపోనుంచి వివిధ ప్రాంతాలకు ఏర్పాటు చేసిన ఐదు నూతన బస్సు సర్వీసులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 2014-19లో గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో మధురవాడలో డిపో ఏర్పాటు చేసినట్టు చెప్పారు. తరువాత ఎలాంటి పురోభివృద్ధి లేదని, ఇప్పుడు మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తక్కువ కాలంలోనే కొత్త బస్సు సర్వీసులను ప్రారంభించినట్టు పేర్కొన్నారు. మహిళలకు హామీ ఇచ్చిన ఉచిత బస్సు ప్రయాణాలకు సంబంధించి అధ్యయనం సాగుతోందన్నారు. మధురవాడ పరిసర ప్రాంతాల్లోని విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలని పలువురు కోరారు. ఈ కార్యక్రమంలో భీమిలి టీడీపీ ఇన్‌చార్జి కోరాడ రాజబాబు, విజయ్‌బాబు, ఆర్టీసీ రీజనల్ మేనేజర్ అప్పలరాజు, డీసీఎం అప్పలనాయుడు, మధురవాడ డిపో మేనేజర్ ఉమామహేశ్వరావు, నేతలు మొల్లి లక్ష్మణరావు, పిల్లా వెంకట్రావు, వాండ్రాసి అప్పలరాజు, నాగోతి సత్యనారాయణ, గొల్లంగి ఆనందబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కనకమ్మ మారువారం పండుగ


వివిధ వేషధారణల మధ్య అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు

వెంకోజిపాలెం, ఆగస్టు 27: పాతవెంకోజీపాలెం గొల్లవీధిలోని కనకమ్మ అమ్మవారి మారువారం పండుగ మంగళవారం ఘనంగా జరిగింది. తెల్లవారు జాము నుంచి అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు. మహిళలు పసుపు, కుంకుమ, చీర, జాకెట్, గాజులను సమర్పించారు. శ్రీ రాధాకృష్ణ యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం అమ్మవారి పెద్దింటి నుంచి పసుపు, కుంకుమను కొత్త వెంకోజిపాలెంలోని శ్రీ భూలోకమాత అమ్మవారికి ఊరేగింపుగా తీసుకువెళ్లారు. సాముగరిడి, బల్ల వేషాలు ఆకట్టుకున్నాయి. యాదవ సంఘం అధ్యక్షులు ఒమ్మి ముత్యాలరాజు, ఇతర ప్రతినిధులు పల్లా పెంటారావు, ఒమ్మి కోటిబాబు, ఒమ్మి అప్పలరాజు, ఒమ్మి రాజు, జోగ రాంబాబు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సింహాచలేశుడికి ఘనంగా ఆర్జిత సేవలు


స్వామి వారికి గరుడ సేవ నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం, ఆగస్టు 27: వరాహలక్ష్మీనృసింహస్వామికి మంగళవారం పలు ఆర్జిత సేవలు వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామిని మేల్కొలిపి ప్రభాతారాధనలు యథావిధిగా పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ప్రత్యక్షంగా పాల్గొన్న భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలు చేసి షోడశోపచారాలు సమర్పించారు. ఆర్జిత సేవలో తొలుతగా నృసింహ సహస్రనామా వళి పఠిస్తూ పవిత్ర తులసీ దళార్చన కావించారు. అనంతరం గోవిందరాజస్వామిని రజిత గరుడ వాహనంపై ఉంచి భక్తుల గోత్రనామాలతో అష్టోత్తర శతనామార్చన చేసిన తరువాత మంగళవాయిద్యాల మెంట భక్తులు స్వామి చుట్టూ ముమ్మారు ప్రదక్షిణలు చేశారు. గరుడసేవలో భాగంగా శీతల ప్రసాదాన్ని నివేదన జరిపారు. అనంతరం అదే వేదికపై ఉదయం 9.30కు పాంచరాత్రాగమ శాస్త్ర విధానంలో సంకల్పించి కంకణధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణలతో ఆర్జిత నిత్యకల్యాణాన్ని ప్రారంభించారు. మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్చారణల మధ్య జీలకర్రా బెల్లం, మాంగళ్యధారణలు చేసి అక్షితారోపణం (తలంబ్రాలు) వేడుకగా నిర్వహించారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాల తరువాత ఆర్జిత సేవల్లో పాల్గొన్న భక్తులందరికి వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

ఆన్‌లైన్ పరీక్షల్లో కేజీబీవీ విద్యార్థినుల ప్రతిభ


సర్టిఫికెట్లతో విద్యార్థినులు దీపిక, ప్రవల్లిక

భీమునిపట్నం, ఆగస్టు 27: గొల్లలపాలెంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయానికి చెందిన ఇద్దరు విద్యార్థినులు ఇన్ఫోసిస్ స్ప్రింగ్ బోర్డు ఆన్‌లైన్ టెస్ట్‌లో ఉత్తీర్ణత సాధించి సర్టిఫికెట్లు పొందినట్టు ప్రిన్సిపాల్ గంగాకుమారి తెలిపారు. విద్యాలయంలో 9వ తరగతి చదువుతున్న చప్పగడ్డ దీపిక, పదో తరగతి విద్యార్థి బండారు ప్రవల్లిక ఇన్ఫోసిస్ ఆన్‌లైన్ లెర్నింగ్ ప్లాట్‌ఫారం ఇన్ఫోసిస్ స్ప్రింగ్ బోర్డులో ఉన్న టైమ్ మేనేజిమెంట్, ఎలక్ట్రానిక్స్ హర్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్, డ్రోన్, రోబోటిక్ కోర్సులు, ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్, సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్ డేటా బేస్, ఎల్ఈడీకి సంబంధించిన కోర్సులను పూర్తిచేసి, సర్టిఫికెట్లు కైవశం చేసుకున్నారన్నారు. వీరు విజేతలుగా నిలవడానికి కంప్యూటర్ ఆపరేటర్ జి.మహాలక్ష్మి సహకరించారన్నారు. భవిష్యత్తులో ఐటీ ఉద్యోగాల్లో ఈ సర్టిఫికెట్లు ఉపయోగపడతాయన్నారు. విజేతలను మంగళవారం సమగ్ర శిక్ష ఏపీసీ శ్రీనివాసరావు, జీసీడీవో కలిషా బేగమ్ అభినందించారు.

విత్తన బంతులతో పచ్చదనం పెంచుదాం


విత్తన బంతులు చల్లుతున్న లయన్స్ క్లబ్ సభ్యులు

సింహాచలం, ఆగస్టు 27: కొండలపై విత్తన బంతులు చల్లడం ద్వారా పచ్చదనాన్ని పెంచుదామని కృష్ణా విశ్వవిద్యాలయ విశ్రాంత ఉప కులపతి సుంకరి రామకృష్ణారావు పిలుపునిచ్చారు. లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ ఎంవీబీఎస్ ప్రసాద్ నేతృత్వంలో మంగళవారం సింహగిరిపై విత్తన బంతులు చల్లారు. దేవతా వృక్షాలు, ఔషధ గుణాలు కలిగిన విత్తనాలతో తయారుచేసిన బంతులు చల్లారు. లయన్స్ క్లబ్ గవర్నర్ ప్రసాద్ మాట్లాడుతూ హీల్ ఎర్త్ నినాదంతో పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో లయన్ ఎం.సురేష్, సీతారత్నం, సాయినిర్మల, రత్నం, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ శ్రీభరత్‌ను కలిసిన సింహాచలం ఈఓ


ఎంపీకి స్వామి విగ్రహాన్ని అందిస్తున్న ఈవో

సింహాచలం, ఆగస్టు 27: ఎంపీ శ్రీభరత్‌ను మంగళవారం ఆయన కార్యాలయంలో సింహాచలం ఈవో శ్రీనివాసమూర్తి, దేవస్థానం పండితులు కలిశారు. ఈ సందర్భంగా పండితులు ఆశీర్వచనాలు అందజేశారు. ఆలయ ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, వేద పండితులు రామాయణం జగన్మోహనశర్మ, వేదాశీర్వచనాలీయగా, ఈఓ, డీఈఈ డీవీఎస్ రామరాజు స్వామివారి దారు విగ్రహాన్ని జ్ఞాపికగా, లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ భక్తుల మనోభావాలకు అనుగుణంగా వైదిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలని వినతి


మంత్రి నారాయణతో ఎమ్మెల్యే గంటా, కార్పొరేటర్ పిల్లా మంగమ్మ, వెంకటరావు

మధురవాడ, ఆగస్టు 27: వార్డు పరిధిలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పురపాలక శాఖా మంత్రి పి.నారాయణను కార్పొరేటర్ పిల్లా మంగమ్మ కోరారు. నగరంలోని ఎమ్మెల్యే గంటా నివాసంలో మంగళవారం మంత్రిని కలిసిన ఆమె మధురవాడ ప్రాంతంలో భూగర్భ నీటి మట్టం తగ్గిపోయిందని, ప్రజలంతా మునిసిపల్ నీటి సరఫరాపై ఆధారపడుతున్నారని వివరించారు. ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని కోరారు. వీధి దీపాల నిర్వహణను పట్టించుకోవడం లేదని, చంద్రంపాలెం పాఠశాలలో వేలాది మంది విద్యార్థులు చదువుతున్నారని, రోడ్డు దాటే సమయంలో ప్రమాదాల బారిన పడుతున్నారని, ఈ నేపథ్యంలో ఫుట్ ఓవర్ వంతెన నిర్మించాలని కోరారు. ఆమె వెంట టీడీపీ వాణిజ్య విభాగం కార్యదర్శి పిల్లా వెంకటరావు ఉన్నారు.

అన్న క్యాంటీన్ ఏర్పాటుచేయాలి

ఆనందపురం: మండలంలోని వేములవలస పూలమార్కెట్ వద్ద అన్న క్యాంటీన్‌ను ఏర్పాటు చేయాలని పురపాలక శాఖా మంత్రి పి.నారాయణకు తర్లువాడ టీడీపీ నాయకులు మంగళవారం వినతి పత్రం అందజేశారు. వేములవలస పూలమార్కెట్ రాష్ట్రంలోనే అతిపెద్ద మార్కెట్‌గా మారిందని, ఇతర ప్రదేశాల నుంచి ప్రతిరోజూ వందలాది మంది క్రయ విక్రయాలకు వస్తారన్నారు. వారిని దృష్టిలో పెట్టుకుని పూలమార్కెట్ సమీపంలో అన్నక్యాంటీన్‌ను ఏర్పాటు చేసి ప్రజల ఆకలిని తీర్చాలని కోరారు. కార్యక్రమంలో తర్లువాడ సర్పంచ్ బి.ఆర్.బి.నాయుడు, నాయకులు తాత్రాజు అప్పారావు పాల్గొన్నారు.

గణనీయంగా పెరుగుతున్న డీహైడ్రేషన్ కేసులు

రామ్‌నగర్, ఆగస్టు 27: పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, వేడిగాల్పులతో మానవ శరీరంలో సైలెంట్ డిహైడ్రేషన్ పెరిగి, తీవ్ర అనారోగ్య పరిస్థితులు నెలకొంటున్నట్టు ఇంటర్నల్ మెడిసిన్ ఫిజీషియన్స్ లోక్‌నాథ్ త్రిపాటి, ఎం.వి.ఇ. రామానాయుడు తెలిపారు మంగళవారం ఓ హోటల్‌లో వాతావరణ మార్పులు, శరీరంలో డిహైడ్రేషన్ అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కొంతకాలంగా రాష్ట్రంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో డి హైడ్రేషన్‌కు లోనై 1788ప్రాణాలు కోల్పోయారన్నారు. ఎక్కువ ప్రభావిత ప్రాంతాల్లో విశాఖ నగరం కూడా ఉందన్నారు. విపరీమైన తేమ వల్ల ఉష్ణోగ్రతలు తరచుగా పెరిగే అవకాశాలున్నాయని, దీంతో సైలెంట్ డీహైడ్రేషన్ కేసులు పెరుగుతున్నాయన్నారు. ఇళ్లలోనే పరిశుభ్రంగా తయారు చేసుకునే ఒరల్ రిహైడ్రేషన్ సొల్యూషన్ (ఓఆర్ఎస్) అధికంగా తీసుకోవాలని సూచించారు.

వీనుల విందుగా గాత్ర కచేరీ



కచేరీ నిర్వహిస్తున్న అరుణ్

మద్దిలపాలెం, ఆగస్టు 27: పిఠాపురంకాలనీ కళాభారతి ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించిన గాత్రకచేరి వీనులవిందుగా సాగింది. చెన్నైకి చెందిన కళాకారుడు ఒ.ఎస్.అరుణ్ గానంతో మంత్రముగ్ధులను చేశారు. గంభీర నాట్టాయి, వాతాపి గణ పత్తింభజేహం, రంగనాథుడే, ఎందరో మహానుభావులు, మోముచూపర కృష్ణ గీతాలు ఆలపించి సంగీతాభిమానులను ఉల్లాసపరిచారు. అన్నమాచార్యుల కీర్తనలతో అలరించారు. అరుణ్ గానానికి వయోలిన్‌పై నీలాద్రిరావు, మృదంగంపై ఏడుకొండలు, తబలా ధనుంజయ వాయిద్యంతో కచేరీని రక్తికట్టించారు. ఈ కార్యక్రమంలో విశాఖ మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ నిర్వాహకులు మంతెన సత్యనారాయణ, గుమ్మలూరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఏయూలో గెస్ట్ ఫ్యాకల్టీ నియామకానికి చర్యలు

వెంకోజీపాలెం, ఆగస్టు 27: ఏయూలోని అన్ని కళాశాలల్లో గెస్ట్ ఫ్యాకల్టీని నియమించడానికి సత్వరం చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాళ్లకు ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు ఆదేశాలు జారీచేశారు. విద్యార్థుల బోధనకు ఇబ్బంది లేకుండా అధ్యాపకుల కొరత లేకుండా చర్యలు చేపడుతున్నట్టు ఆయన తెలిపారు. గతంలో నిలిపిన గెస్ట్ ఫ్యాకల్టీలకు ప్రాధాన్యత ఇస్తామని, గెస్ట్ ఫ్యాకల్టీకి సెమిష్టర్‌కు ఇచ్చే పారితోషకాన్ని మారుతున్న జీవన ప్రమాణాలకు అనుగుణంగా పెంచేలా చర్యలు తీసుకుంటున్నట్టు ఆయన వివరించారు.

కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి: ఏఐటీయూసీ

తగరపువలస, ఆగస్టు 27: పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు కనీస వేతనం రూ26వేలు ఇవ్వాలని ఆలిండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ) డిమాండ్ చేసింది. జీఆర్ భవన్‌లో మంగళవారం ప్రధాన కార్యదర్శి కొండపు ఈశ్వరరావు అధ్యక్షతన సమావేశమయ్యారు. కేంద్రం అమలు చేస్తున్న లేబర్ కోడ్లను రద్దు చేయాలని కోరారు సెప్టెంబరు 1,2,3 తేదీల్లో స్టీల్‌ప్లాంట్ గురుజాడ కళాక్షేత్రంలో జరగనున్న ఏఐటీయూసీ సభలను జయప్రదం చేయాలని కోరారు. అల్లు బాబూరావు, చిల్ల అప్పలసూరి, మావూరి సన్యాసమ్మ, కానూరి రాంబాబు, మోర అప్పలరాజు, అప్పలసూరి పాల్గొన్నారు.

ఒకటో తేదీ నుంచి బీజేపీ సభ్యత్వ నమోదు

భీమునిపట్నం, ఆగస్టు 27: భారతీయ జనతా పార్టీ బలోపేతానికి వచ్చే నెల ఒకటో తేదీ నుంచి సభ్యత్వ నమోదు చేపట్టనున్నట్టు పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కంటుభుక్త రామానాయుడు తెలిపారు. గాడువీధిలోని పార్టీ కార్యాలయంలో అర్బన్ పార్టీ నేతలతో సమావేశాన్ని నిర్వహించారు. నియోజవర్గ పరిధిలో పార్టీని పటిష్టపరచడానికి సభ్యత్వ నమోదు చురుగ్గా చేపట్టాలన్నారు. పార్టీ అర్బన్ అధ్యక్షుడు బత్తిన వెంకటరమణ మాట్లాడుతూ 3, 4 వార్డుల నేతలు కనీసం 8 వేల మందిని పార్టీలో చేర్పించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. సమావేశంలో కంటుభుక్త సునీత, కొండబాబు, విజయ, కవిత, ఆదినారాయణ, రాము, అప్పలనాయుడు, పృథ్వీ లక్ష్మి, అప్పలకొండ, హరీశ్, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

గ్రామ స్థాయిలో కార్యక్రమాలు

భీమునిపట్నం (రూరల్): బీజేపీ సభ్యత్వ నమోదులో భాగంగా రేఖవానిపాలెం మంగళవారం మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్‌చార్జి కంటుభుక్త రామానాయుడు మాట్లాడారు. మండలశాఖ అధ్యక్షుడు కాళ్ల కాసులు, అడుసుమిలి కేశవకాంత్, రేఖ కరుణారావు, చైతన్యవర్మ, ముని సన్యాసిరావు రేఖ రేణుక తదితరులు పాల్గొన్నారు.

నృసింహవనంలో వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి

సింహాచలం, ఆగస్టు 27: సింహాచలంలోని నృసింహవనంలో మంగళవారం శ్రీకృష్ణ జన్మాష్టమిని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. గోమాతను షోడశోపచారాలతో అర్చించారు. అర్చకులు సంతోష్‌శర్మ ప్రత్యేక పూజలు చేశారు. ఈవో సింగాల శ్రీనివాసమూర్తి, ఈఈ బి.రాంబాబు, భక్తులు గోమాతలకు ప్రదక్షిణలు చేసి పసుపు, కుంకుమలు, పుష్పాలు, అక్షితలతో పూజించారు. ముందుగా శ్రీకృష్ణుని విగ్రహం వద్ద అష్టోత్తరశత నామార్చనలు చేశారు. స్వామి వారి పోటులో తయారు చేసిన గారెలు, పులిహోర తదితర ప్రసాదాలను కృష్ణునికి, గోమాతకు నివేదన చేశారు. అధికారులు, భక్తులు గోవులకు ప్రత్యేక దాణాను, గారెలను తినిపించారు.

ఆరిలోవ: తోటగరువు శ్రీకృష్ణ ఆలయంలో నిర్వహిస్తున్న వేడుకల్లో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేత ఒమ్మి సన్యాసిరావు, కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి రాజశేఖర్, గాడి సత్యం, ఒమ్మి పోలారావు, సన్యాసిరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఐశ్వర్య వెంకటేశ్వర స్వామి ఆలయంలో

భీమునిపట్నం: స్థానిక ఐశ్వర్య వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు జరిగాయి. ప్రాంగణంలో ఉట్టి సంబరం నిర్వహించారు. ట్రస్టీలు కలిగొట్ల సూర్యనారాయణమూర్తి, కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి, భానోజీరావు, శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి 12 రకముల పిండివంటలతో ప్రసాదాన్ని నివేదించారు. కృష్ణాకాలనీ శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గాడు అప్పలనాయుడు ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. వేణుగోపాలస్వామి ఆలయంలో అర్చకులు రొంపిచెర్ల కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.

హరేకృష్ణ మూవ్‌మెంట్ వ్యవస్థాపక గురువు జయంతి

ఆనందపురం: ఐఐఎం రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠం ఆధ్వర్యంలో వ్యవస్థాపక గురువు శ్రీభక్తి వేదానంద స్వామి ప్రభుపాద 128వ జయంతిని నిర్వహించారు. అధ్యక్షులు నిష్కించిన భక్తదాస మాట్లాడుతూ సమాజంలో ప్రశాంతత కొరవడిన 1960లో కృష్ణ చైతన్యాన్ని వ్యాప్తి చేశారన్నారు. ఆయన జన్మదినాన్ని కృష్ణాష్టమి మరుసటి రోజు వ్యాసపూజ పేరుతో జరుపుకుంటామన్నారు. ప్రభు పాదులకు అభిషేకాలు నిర్వహించి, భక్తులకు దర్శనం కల్పించారు.


నృసింహవనంలో శ్రీకృష్ణునికి పూజలు చేస్తున్న అర్చకులు


భీమిలి కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీకృష్ణుడు


ప్రభుపాద చిత్రపటానికి పూజలు చేస్తున్న భక్తదాస